RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 230 | పేజీలు : 08 | ఆదివారం | 30-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

## 22ఏ భూముల సమస్యలపై పోరుబాట

- బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో రాంచందర్ రావు కీలక భేటీ
- మరో రెండు పోరాటాలకు రెడీ అవుతున్న తెలంగాణ బీజేపీ
- సెప్టెంబర్ 5, 6 తేదీల్లో 22ఏ భూముల వ్యవహారంపై దీక్ష
- ఆదిలాబాద్నుంచి అసెంబ్లీ వరకు రైతు యాత్ర



## తలక్రిందులుగా తపస్సు చేసినా..

### వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

మంత్రి పొంగులేటి



## ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్‌పై వేటు..

అసదుద్దీన్‌ను నిలదీసిన రాజాసింగ్

- మజ్లిస్ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరణ
- అర్ధరాత్రి చర్యల వెనుక కారణాలు చెప్పాలన్న రాజాసింగ్
- అసదుద్దీన్ ఓవైసీ మీడియా ముందు వివరణ ఇవ్వాలని డిమాండ్
- ల్యాండ్ వివాదాలు, వ్యక్తిగత ఆరోపణలే కారణమంటూ ప్రచారం
- డీప్‌ఫేక్ వీడియోల అంశంపైనా స్పష్టత కోరిన బీజేపీ ఎమ్మెల్యే



హైదరాబాద్ పల్స్,డెస్క్

ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి



## నేడు నీట్ పీజీ 2026 పరీక్ష

- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన కేంద్రం
- దేశవ్యాప్తంగా నేడు నీట్-పీజీ 2026 పరీక్ష నిర్వహణ
- 2.73 లక్షల మందికి పైగా హాజరుకానున్న వైద్య గ్రాడ్యుయేట్లు
- పటిష్ట భద్రత, పారదర్శకతకు పెద్దపీట వేసిన కేంద్ర ప్రభుత్వం
- ప్రశ్నపత్రం లీక్ వదంతులు పూర్తిగా అవాస్తవమన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా
- ఈ ఏడాది పలు విద్యార్థి-స్నేహపూర్వక సంస్కరణల అమలు

హైదరాబాద్ పల్స్,డెస్క్

దేశవ్యాప్తంగా వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) సీట్ల భర్తీకి నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్-పీజీ 2026)కు సర్వం సిద్ధమైంది. ఆదివారం (ఆగస్టు 30) దేశంలోని 340 నగరాల్లో 1,300 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 2.73 లక్షల మందికి పైగా వైద్య గ్రాడ్యుయేట్లు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ పరీక్ష ద్వారానే దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్

# సర్ పై గడువు పెంచండి



- సర్‌పై అభ్యంతరాలు,క్లెయిమ్‌ల గడువు పొడిగించండి : సీఈసీకి రేవంత్ రెడ్డి లేఖ
- కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌కు సీఎం రేవంత్ రెడ్డి లేఖ
- ఎస్ఐఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపిన సీఎం
- ఓటర్ల పరిశీలనలో అనేక లోపాలు ఉన్నాయని ఆరోపణ

హైదరాబాద్ పల్స్,డెస్క్

తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు మరో నాలుగు వారాలు సమయం ఇవ్వడంతో పాటు తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ సవరించాలని సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు సీఎం లేఖ రాశారు. ఓటర్లకు అవసరమైన సహాయం అందించేందుకు పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. కనీసం రెండు సార్లు గ్రామ, వార్డు సభలు నిర్వహించి ముసాయిదా ఓటరు జాబితాను చదివి వినిపించాలన్నారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా పోవద్దన్న సీఎం రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు.

### నోటీసు ఇవ్వకుండానే తొలగించారు

ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని రేవంత్ రెడ్డి కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువు పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు సీఎం లేఖ రాశారు. రాష్ట్రంలో 3 కోట్ల 38లక్షల ఓటర్లు ఉండగా అందులో 73 లక్షల 39వేలు మృతి, డూప్లికేట్, ఆబ్‌సెంట్, ఇతర ప్రాంతాలకు షిఫ్టయిన ఏఎస్?డీడీ కేటగిరీలో పెట్టారని సీఈసీకి రాసిన లేఖలో సీఎం వివరించారు.



## ఇంకెన్నిసార్లు ఆడుకుంటారు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జనసేన పార్టీ తీవ్ర విమర్శలు
- పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనలను అణచివేయాలని చూడటం దుర్మార్గమన్న జనసేన
- పాలిటెక్నిక్ కళాశాలల భవిష్యత్తును గందరగోళంలోకి నెట్టేస్తున్నారని మండిపాటు
- విద్యార్థుల జీవితాలతో ఇంకెన్నిసార్లు ఆడుకుంటారని ప్రశ్న

హైదరాబాద్ పల్స్,డెస్క్

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జనసేన పార్టీ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనలను పోలీసులు, లాఠీఛార్జీలు, అక్రమ అరెస్టులతో అణచివేయాలని చూడటం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల భవిష్యత్తును తీవ్ర గందరగోళంలోకి నెడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు

## రేవంత్ రెడ్డే కాపాడుతున్నారు

- కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌ను రేవంత్ రెడ్డే కాపాడుతున్నారు : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- హరికృష్ణపై కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ రాడ్లతో దాడి చేశారన్న ప్రవీణ్ కుమార్
- సుమంత్ పై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం వెనుక రేవంత్ హస్తం ఉందని ఆరోపణ
- సీఐ ముత్తు యాదవ్ ను అకారణంగా సస్పెండ్ చేశారని మండిపాటు



హైదరాబాద్ పల్స్,డెస్క్

మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌ను అరెస్ట్ కాకుండా స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాపాడుతున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ మేరకు ఆరోపించారు. జూలై 30వ తేదీన

## మంత్రివర్గంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది

మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి




## వేప చెట్టు విషయంలో 25 ఏళ్లుగా వివాదం

- సూర్యాపేట జిల్లాలో ఇద్దరి దారుణ హత్య
- వేపచెట్టుపై రెండు కుటుంబాలకు 25 ఏళ్లుగా వివాదం
- తన తండ్రి సహా మరో వ్యక్తిని హత్య చేసిన నిందితులు
- ఆగ్రహించిన గ్రామస్థులు
- పరిస్థితిని అదుపులోకి తీసుకోబోయిన ఎస్సై తలకు గాయం

# ఏ క్షణంలోనైనా బద్దలవ్వొచ్చు

నేపాల్‌కు చైనా మరోసారి హెచ్చరిక

### నేపాల్-టిబెట్ సరిహద్దులో కృత్రిమంగా ఏర్పడిన సరస్సుపై చైనా హెచ్చరిక

### హిమనీనదం కూలడంతో ఏర్పడిన సహజ ఆనకట్టతో మరో ప్రమాద ఘంటికలు

- సరస్సు నీటిమట్టం తగ్గడంతో తాత్కాలికంగా తగ్గిన తక్షణ ముప్పు
- ఇప్పటికే వందల మంది మృతి, వెయ్యికి పైగా గల్లంతు.. కొనసాగుతున్న సహాయక చర్యలు
- డ్రోన్లు, శాటిలైట్లతో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్న అధికారులు

హైదరాబాద్ పల్స్,డెస్క్

నేపాల్-టిబెట్ సరిహద్దులో హిమనీనదం కూలిపోవడంతో ఏర్పడిన కృత్రిమ సరస్సు (బ్యారియర్ లేక్) ఏ క్షణంలోనైనా బద్దలయ్యే ప్రమాదం ఉందని చైనా అధికారులు నేపాల్‌ను మరోసారి హెచ్చరించారు. ఈ సరస్సు గట్టు తెగితే భారీగా వరద నీరు దిగువ



# 22ఏ భూముల సమస్యలపై పోరుబాట

మొదటి పేజీ రువాయి

తెలంగాణలో ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ పార్టీని బలోపేతం చేసుకునే దిశగా బీజేపీ ముందుకు సాగుతోంది. ఇటీవల విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ విజయవంతంగా దీక్ష నిర్వహించిన బీజేపీ నాయకత్వం... తాజాగా రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా మరో రెండు ప్రధాన పోరాటాలకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో నిషేధిత 22ఏ జాబితాలో చేర్చిన భూముల వ్యవహారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల (సెప్టెంబర్) 5, 6 తేదీల్లో బీజేపీ నేతలు భారీ దీక్ష చేపడుతున్నారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై చర్చించేందుకు ఈరోజు నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. మరోవైపు, ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ లోని అసెంబ్లీ వరకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ 'రైతు యాత్ర' చేపడుతున్నారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేయనున్నట్లు బీజేపీ ప్రకటించింది.

# ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్‌పై వేటు..

మొదటి పేజీ రువాయి

బహిష్కరించడంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని డిమాండ్ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు మజ్లిస్ పార్టీ ప్రకటించింది. దీనితో పాటు, ఆయన తక్షణమే తన శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేయాలని ఆదేశించింది. ఆయనపై ఉన్న కొన్ని వివాదాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు సంకేతాలిచ్చినప్పటికీ, బహిష్కరణకు గల నిర్దిష్ట కారణాలను మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో రాజాసింగ్ మాట్లాడుతూ, ఈ బహిష్కరణ పాతబస్తీ ప్రజల్లో అనేక సందేహాలను రేకెత్తించిందని అన్నారు. అర్ధరాత్రి వేళ అత్యవసరంగా ఇటువంటి చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితులు ఎందుకు తలెత్తాయో పార్టీ నాయకత్వం వివరించాలని ఆయన ప్రశ్నించారు. అసదుద్దీన్ ఓవైసీ జాతీయ మీడియా ముందుకు వచ్చి, ఈ ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. భూవివాదాలు, లైంగిక వేధింపుల అంశాలకు సంబంధించిన ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్నాయని రాజాసింగ్ గుర్తుచేశారు. గతంలో తనను డీప్‌ఫేక్ వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని రహ్మత్ బేగ్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, తాజా పరిణామాలకు ఆ ఘటనతో ఏమైనా సంబంధం ఉందా అనే విషయంపై క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# నేడు నీట్ పీజీ 2026 పరీక్ష

మొదటి పేజీ రువాయి

వైద్య కళాశాలల్లో ఎండీ (డాక్టర్ ఆఫ్ మెడిసిన్), ఎంఎస్ (మాస్టర్ ఆఫ్ సర్జరీ) వంటి ఉన్నత వైద్య కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తారు. గతేడాదితో పోలిస్తే ఈసారి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య 12.5 శాతం పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (చీదీజుమీ) ఆగస్టు 26న అడ్మిట్ కార్డులను విడుదల చేసింది. పరీక్ష మొత్తం ఒకే షిఫ్టులో జరగనుంది.

**అక్రమాలకు తావివ్వం: మంత్రి జేపీ నడ్డా**

పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు. ఎన్‌బీఈఎంఎస్, టెక్నాలజీ భాగస్వాములు, ఇతర ఏజెన్సీల సంసిద్ధతను ఆయన సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, అత్యంత పకడ్బందీగా పరీక్షను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రశ్నపత్రం లీక్ అయిందంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను, మోసపూరిత ప్రచారాలను అభ్యర్థులు నమ్మవద్దని నడ్డా విజ్ఞప్తి చేశారు. "పరీక్ష ప్రారంభానికి కొద్ది సమయం ముందు మాత్రమే అత్యంత సురక్షితమైన, ఎన్‌క్రిప్టెడ్ విధానంలో తుది ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేస్తారు. దీనికి బహుళ అంచెల సాంకేతిక, కార్యాచరణ భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. కాబట్టి, ఎవరైనా ప్రశ్నపత్రం ముందుగానే తమకు లభించిందని చెబితే అది పూర్తిగా అవాస్తవం, అభ్యర్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నమే" అని ఆయన తేల్చి చెప్పారు. అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, కేవలం ఎన్‌బీఈఎంఎస్, ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సూచించారు.

**భారీ భద్రత, కొత్త సంస్కరణలు**

పరీక్షల సమగ్రతను కాపాడేందుకు ఈసారి పటిష్ఠమైన భద్రతా ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా సీసీటీవీ నిఘా, బయోమెట్రిక్ వెరిఫికేషన్, సిగ్నల్ జ్యామర్లు, డైనమిక్ కంప్యూటర్ కేటాయింపు వంటి చర్యలు చేపట్టారు. పరీక్షల పర్యవేక్షణకు సెంట్రల్, రీజనల్ కమాండ్ సెంటర్ల ద్వారా లైవ్ మానిటరింగ్ చేయనున్నారు. ఇందుకోసం 60,000 మందికి పైగా సిబ్బందిని నియమించారు. ఈ ఏడాది విద్యార్థుల సౌలభ్యం కోసం పలు సంస్కరణలు ప్రవేశపెట్టారు. అభ్యర్థులు తమ సొంత రాష్ట్రంతో పాటు మరో రెండు రాష్ట్రాలను పరీక్షా కేంద్రాల కోసం ఎంచుకునే వెసులుబాటు కల్పించారు. పరీక్ష జరిగే నగరం సమాచారాన్ని మూడు వారాల ముందే తెలియజేయడంతో, ప్రయాణ ఏర్పాట్లకు విద్యార్థులకు తగినంత సమయం లభించింది. పరీక్షా విధానంలో కూడా మార్పులు చేశారు. 210 నిమిషాల్లో 180 ప్రశ్నలకు సమాధానమిచ్చేలా సమయాన్ని పెంచారు. రిజిస్ట్రేషన్, పరీక్ష సమయంలో ఆధార్ ఆధారిత గుర్తింపును తప్పనిసరి చేశారు. వేలిముద్రలు సరిపోలని సందర్భాల్లో ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్ వెరిఫికేషన్‌ను ప్రత్యామ్నాయంగా వినియోగించనున్నారు.

# ఇంకెన్నిసార్లు ఆడుకుంటారు

మొదటి పేజీ రువాయి

శవరాజకీయాలు, పరస్పర నిందారోపణల నాటకాలకు తెరలేపాయని తన ఎక్స్ వేదికగా ధ్వజమెత్తింది. హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై పదే పదే లాఠీలు ఝుళిపిస్తూ రోడ్లపైకి ఈడ్చడం ఏంటని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించింది. ఇంకెన్నిసార్లు విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటారని, ఎంతమందిపై కేసులు పెడతారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం తక్షణమే తన నిరంకుశ, మొండి వైఖరిని వీడాలని... విద్యా వ్యవస్థ నాశనమవుతోందనే ప్రజల, విద్యార్థుల మనోభావాలను అర్థం చేసుకోవాలని హితవు పలికింది. ప్రస్తుత తరుణంలో తెలంగాణ యువతకు కావాల్సింది నాణ్యమైన సాంకేతిక విద్య, ఆధునిక నైపుణ్యాలు, భవిష్యత్తుకు భరోసానిచ్చే ఉపాధి అవకాశాలే తప్ప ఈ అణచివేతలు కాదని జనసేన స్పష్టం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా ఈ నియంతృత్వ పోకడలను పక్కనపెట్టి విద్యార్థుల గోడును వినాలని డిమాండ్ చేసింది. విద్యా రంగంలో సంస్కరణలు చేపట్టే ముందు వివేకంతో ఆలోచించి, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది.

# వేప చెట్టు విషయంలో 25 ఏళ్లుగా వివాదం

మొదటి పేజీ రువాయి

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలంలోని ఎర్రగడ్డ తండాలో దారుణం చోటుచేసుకుంది. ఇంటి సమీపంలో ఉన్న వేప చెట్టు విషయంలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదం ఇద్దరి హత్యకు దారి తీసింది. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా, కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో నిందితులు తమ సొంత తండ్రినే చంపేయడం ఈ విషాదాన్ని మరింత తీవ్రంగా మార్చింది.

**చెట్టును నరికేశారని గొడవ పెట్టుకొని**

ఇళ్ల సరిహద్దులో ఉన్న వేప చెట్టు విషయంలో వెంకటేశ్వర్లు, భూక్యా సైదా కుటుంబాల మధ్య గత 25 ఏళ్లుగా వివాదం నడుస్తోంది. ఇవాళ ఉదయం సైదా కుమారులు రాము, పెద్దబాబులు వెంకటేశ్వర్లు ఇంటి ముందు కొన్ని వేప కొమ్మలను వేసి నిప్పు పెట్టారు. దీంతో వెంకటేశ్వర్లు కొంతమందిని పిలిపించి ఆ చెట్టును నరికించబోయారు. ఎన్నో సంవత్సరాలుగా చెట్టు కోసం వివాదం జరుగుతోందని, అలాంటప్పుడు చెట్టును ఎలా నరుకుతావని రాము, పెద్దబాబు వెంకటేశ్వర్లును ప్రశ్నించారు. వారి మధ్య వాగ్వాదం ముదరడంతో పెద్దబాబు గొడ్డలితో వెంకటేశ్వర్లుపై విచక్షణా రహితంగా దాడి చేయగా, అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

**గొడవగా చిత్రీకరించే యత్నం**

వెంకటేశ్వర్లును తమ కుమారులు హతమార్చడం గమనించిన సైదా వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దీంతో వారు వెంకటేశ్వర్లుకు మద్దతిస్తావా అంటూ తండ్రిపై కూడా గొడ్డలితో దాడి చేశారు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సైదా మృతి చెందాడు. చెట్టు విషయంలో జరిగిన పరస్పర ఘర్షణలో వెంకటేశ్వర్లు చనిపోయినట్లుగా చిత్రీకరించేందుకే నిందితులు తన సొంత తండ్రిపై దాడి చేశారని స్థానికులు చెబుతున్నారు. ఇదంతా గమనించిన గ్రామస్థులు భూక్యా సైదా ఇంటిపై రాళ్లతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించగా మేళ్లచెరువు ఎస్సై నవీన్ కుమార్ తలకు గాయాలయ్యాయి. అతణ్ని వెంటనే హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడికి కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ ?రెడ్డి సైతం చేరుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రేవంత్ రెడ్డే కాపాడుతున్నారు

మొదటి పేజీ రువాయి

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్, చెక్‌పోస్ట్ సమీపంలోని ఒక డెన్‌లో కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ తన అనుచరులతో కలిసి బాధితుడు హరికృష్ణపై రాడ్లతో దారుణంగా దాడి చేశారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. జూలై 31న బాధితుడు ఫిర్యాదు చేస్తే, దాదాపు 20 రోజుల పాటు కేసు నమోదు కాకుండా అడ్డుకుని ఆగస్టు 20న మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తం ఉందన్నారు. జూబ్లీహిల్స్‌లో దాడి జరిగితే సైబరాబాద్ పరిధిలోని మేడిపల్లిలో కేసు నమోదు కావడం సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తోందని వ్యాఖ్యానించారు. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత వివాదాస్పద వ్యాఖ్యలు చేసేంత వరకు సుమంత్‌పై కేసు నమోదు కాకుండా తొక్కిపెట్టారని, కేసు నమోదైనా ఇప్పటి వరకు సుమంత్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేదని నిలదీశారు. పైగా కేవలం మూడు వారాల క్రితమే బాధ్యతలు స్వీకరించిన జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్‌ను ఈ వ్యవహారంలో బలిపశువును చేస్తూ అకారణంగా సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# సర్‌పై గడువు పొడిగించండి

మొదటి పేజీ రువాయి

అన్‌మ్యాపింగ్, అనామలిస్ కేటగిరీల్లో మరో 92 లక్షల 86 వేల మందికి నోటీసులు ఇస్తున్నారన్నారు. సుమారు మూడో వంతు ఓటర్లు నిరూపించుకోవడం లేదా ఓటు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. ఏఎస్‌డీడీ కేటగిరీలో సుమారు 62 శాతం అంటే 45 లక్షల 19 వేల మంది శాశ్వతంగా షిఫ్ట్ అయిన కేటగిరీలో పెట్టారన్న సీఎం ఓటర్ల పరిశీలన విధానంలో పలు లోపాలున్నాయన్నారు. తాత్కాలికంగా బయటకు వెళ్లిన వారు శాశ్వతంగా షిఫ్టెడ్‌కు తేడా చూపలేదన్నారు. బీఎల్ఓలు వెళ్లిన సమయంలో ఏదైనా పనిపై తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని కూడా శాశ్వతంగా షిఫ్టెడ్?గా పెట్టారన్నారు. నిజంగా శాశ్వతంగా అడ్రస్ మారిన వారు కొత్త ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకునేలా సహకరించకుండా అప్పటి వరకున్న చోట ఓటు తొలగించారని సీఎం వివరించారు. నివాసం మారిన వారికి నోటీసు ఇవ్వకుండానే తొలగించారన్నారు. దీనివల్ల ఓటర్లు పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు పోయిందన్న విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం ఏఎస్‌డీడీ ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివాలి**

తెలంగాణ రాష్ట్రంలో సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి లేఖలో తెలిపారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించడంతో అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని సవరించాలని రేవంత్‌రెడ్డి కోరారు. పల్లెలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం చేయాలన్న రేవంత్‌రెడ్డి కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని ముఖ్యమంత్రి కోరారు.

**పూర్తి సహకారం ఇస్తాం**

హైదరాబాద్‌లో నియోజకవర్గానికి 78 వేలకుపైగా నోటీసులు అందుకుంటున్న వారు ఉన్నందున కొద్దిమంది ఈఆర్‌వోలు సరిపోరన్నారు. అదనపు ఈఆర్‌వోలను కూడా నియమించడంతో పాటు నోటీసుల్లోనే విచారణ తేదీ, సమయాలను పేర్కొంటూ క్షేత్రస్థాయిలో విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అర్హత ఉన్న ప్రతీ ఓటరుకు న్యాయం జరిగేలా కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు, గ్రామసభల నిర్వహణతో పాటు ఇతర అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో స్పష్టం చేశారు.

# తలక్రిందులుగా తపస్సు చేసినా..

మొదటి పేజీ రువాయి

సూర్యాపేట, ఆగస్టు 29: ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# మంత్రివర్గంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది

మొదటి పేజీ రువాయి

ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు దాటినందున క్యాబినెట్‌లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న మంత్రివర్గాన్ని మార్పులు, చేర్పులు చేస్తే ప్రభుత్వంలో కొత్తదనం వస్తుందని ఆయన పేర్కొన్నారు. క్యాబినెట్‌లోనే కాదు ప్రభుత్వంలోనూ మార్పు రావాల్సిన అవసరమని గుత్తా సుఖేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆసక్తికర చర్చకు దారి తీస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడు, ఆయనకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని, అడ్డంకులు సృష్టించొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

వర్గ పోరు తగ్గించాలి

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రభుత్వ పనితీరు, కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై చర్చకు తెరలేపేలా శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు అసెంబ్లీలోని తన చాంబర్‌లో మీడియాతో గుత్తా చిట్ చాట్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలను తగ్గించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఏ పార్టీలోనైనా క్రమశిక్షణ ముఖ్యమేనని పార్టీ లైన్ దాటి మాట్లాడే వారిపై చర్యలు తీసుకోకపోతే పార్టీకి నష్టం జరుగుతుందని మండలి ఛైర్మన్ హెచ్చరించారు.

లీకేజీలను అరికట్టాలి

పార్టీ అంతర్గత విషయాలు బయటకు లీక్ కాకుండా నియంత్రించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ లీకేజీలను అరికట్టాలని ఆయన సూచించారు. పార్టీని బలోపేతం చేయాలంటే క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ అంశాలన్నింటినీ నియంత్రిస్తే కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటుందని గుత్తా సుఖేందర్‌రెడ్డి దీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహారంపైనా గుత్తా స్పందించారు. ఆయన ఓపెన్‌గా మాట్లాడకుండా ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. పార్టీ లైన్ దాటి చిన్నారెడ్డి మాట్లాడటం సరైంది కాదని స్పష్టం చేశారు. పార్టీకి సంబంధించిన అంశాలపై బహిరంగ వ్యాఖ్యలు చేయడం కంటే పార్టీ అంతర్గత వేదికలపైనే చర్చించుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని గుత్తా వ్యక్తం చేశారు.

పథకాలపై ప్రజల్లో సరైన ప్రచారం లేదు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గుత్తా సుఖేందర్‌రెడ్డి బలమైన మద్దతు ప్రకటించారు. రేవంత్‌రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడని ఆయనను పనిచేయనివ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఎంకి ఎలాంటి ఆటంకాలు సృష్టించకుండా స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై సామాన్య ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత లేదని గుత్తా సుఖేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన కొన్ని పథకాలను కొనసాగించడంతో పాటు అదనంగా మరికొన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అయితే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లోకి సరైన స్థాయిలో ప్రచారం వెళ్లడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఉచిత పథకాలను తగ్గించాలి

ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో మరింత దృష్టి పెట్టాలని గుత్తా సూచించారు. సంక్షేమ పథకాల విషయంలోనూ మండలి ఛైర్మన్ కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న పెన్షన్ల మొత్తాన్ని రూ.3 వేలకు పెంచాలని అన్నారు. రైతులకు నాలుగు పంటలకు రైతుభరోసా కొనసాగించాలని సూచించారు. అదేవిధంగా ఉచిత పథకాలను క్రమంగా తగ్గించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు మాత్రమే చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బీపీఎల్, ఏపీఎల్ వర్గీకరణకు సంబంధించి గతంలో తాను కొన్ని సూచనలు చేశానని, అయితే వాటిని పట్టించుకోలేదని గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు.

## కూకట్‌పల్లి ఎమ్మెల్యేపై
# విమర్శలను ఖండించిన బీఆర్ఎస్ నాయకులు

**బండి రమేష్ ఆరోపణలు నిరాధారమని మండిపాటు**

**అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధమని స్పష్టం**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, ఓల్డ్ బోయినపల్లి:** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై బండి రమేష్ చేసిన విమర్శలను ఓల్డ్ బోయినపల్లి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మేకల హరినాథ్ ముదిరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రి యాదగిరి పేర్కొన్నారు. ఓల్డ్ బోయినపల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గత పదేళ్ల కాలంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, తాగునీరు, అండర్‌పాస్‌లు తదితర అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని వారు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టకుండా అభివృద్ధి పనులపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజలకు చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలపై చర్చకు వస్తే తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వ్యక్తిగత విమర్శలు, నిరాధార ఆరోపణల ద్వారా రాజకీయ ప్రయోజనం పొందేందుకు కొందరు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బండి రమేష్ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరోపణలు చేస్తున్నారని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూకట్‌పల్లి నియోజకవర్గానికి కొత్తగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలేమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ప్రతిపక్ష నాయకులపై విమర్శలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు సునంద, కుమ్మరి రాజు, రాజు గౌడ్, చందు యాదవ్, ఇమ్రాన్, చంద్రకళ, నదీమ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## గట్టిగా దెబ్బకొడుతున్న ఎల్‌నినో..
# వాతావరణ మార్పులతో పెరుగుతున్న తీవ్రత

**900 ఏళ్ల వాతావరణ చరిత్రపై పగడపు శిలాజాలతో శాస్త్రవేత్తల అధ్యయనం**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29 :** భూగోళం వేడెక్కడం, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాల పెరుగుదల ప్రపంచ వాతావరణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ఎల్‌నినో ప్రభావం కూడా మరింత తీవ్రరూపం దాల్చుతోందని శాస్త్రవేత్తల అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ పరిణామాలు భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా కరువులు, భారీ వర్షాలు, వరదలు, వేడిగాలులు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులకు దారితీయవచ్చని ఆందోళన వ్యక్తమవుతోంది. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కే వాతావరణ దృగ్విషయం. దీని ప్రభావం ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భిన్నంగా కనిపిస్తుంది. కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడగా, మరికొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు, వరదలు సంభవించే అవకాశం ఉంటుంది.

**900 ఏళ్ల వాతావరణ చరిత్రపై పరిశోధన**

మిచిగాన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకుల బృందం ఎల్‌నినోలో చోటుచేసుకున్న దీర్ఘకాలిక మార్పులను అధ్యయనం చేసింది. సాధారణంగా సముద్ర ఉష్ణోగ్రతలకు సంబంధించిన ప్రత్యక్ష రికార్డులు పరిమిత కాలానికే అందుబాటులో ఉండటంతో, పరిశోధకులు పసిఫిక్ మహాసముద్రంలోని గాలాపగోస్ దీవుల నుంచి లభించిన పురాతన పగడపు శకలాలను



విశ్లేషించినట్లు అధ్యయనంలో పేర్కొన్నారు. పగడాల్లోని రసాయనిక మూలకాల నిష్పత్తులు, ఆక్సిజన్ ఐసోటోపుల ఆధారంగా గత శతాబ్దాల సముద్ర ఉష్ణోగ్రతలపై అంచనాలు వేశారు. సుమారు 900 సంవత్సరాల వాతావరణ చరిత్రను పరిశీలించడం ద్వారా ఎల్‌నినో తీవ్రతలో వచ్చిన మార్పులను అధ్యయనం చేశారు.

**వాతావరణ మార్పులతో పెరుగుతున్న ప్రమాదం**

శిలాజ ఇంధనాల వినియోగం వల్ల గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు పెరగడం, భూగోళ ఉష్ణోగ్రతలు అధికం కావడం వంటి పరిణామాలు ఎల్‌నినో వంటి వాతావరణ వ్యవస్థలపై ప్రభావం చూపుతున్నాయని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. తీవ్రమైన ఎల్‌నినో పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపడంతో పాటు నీటి కొరత, ఆహార భద్రత సమస్యలు, అడవి మంటలు, పగడపు దిబ్బల నష్టం వంటి పర్యావరణ సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**కర్బన ఉద్గారాల నియంత్రణే కీలకం**

వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడానికి కర్బన ఉద్గారాలను నియంత్రించడం, శిలాజ ఇంధనాలపై ఆధారాన్ని తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరులను విస్తృతంగా వినియోగించడం అత్యవసరమని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. భూమి ఉష్ణోగ్రతల పెరుగుదలను నియంత్రించకపోతే ఎల్‌నినో వంటి వాతావరణ దృగ్విషయాల ప్రభావం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

# బాధితుల సమస్యలపై తక్షణమే స్పందించాలి

**సామాజిక న్యాయాన్ని ప్రతి అధికారి పాటించాలి.**

**తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, మేడ్చల్-మల్కాజిగిరి :** సమస్యలతో వచ్చే బాధితుల పట్ల అధికారులు, పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా తక్షణమే స్పందించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. చట్టాలను అమలు చేస్తూ సామాజిక న్యాయం అందరికీ అందేలా చూడాలని కోరారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తూముకుంటలో శనివారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ కార్యాలయాలు సహా ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా బాధితుల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయరాదని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, సామాజిక అణచివేత, దాడులు,



వేధింపులు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం వంటి విలువలను సమాజంలోని ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. దాడులు, అవమానాలు, భూవివాదాలు, సామాజిక వివక్ష వంటి అంశాలకు సంబంధించిన ఫిర్యాదులపై పోలీసులు చట్టప్రకారం సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పెండింగ్ భూముల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, పౌర హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలను జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని కోరారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు, రెవెన్యూ అధికారులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సైబర్ ముప్పులను అరికట్టడంలో కృత్రిమ మేధ కీలకం

**హైదరాబాద్‌లో జెన్‌సీ ల్యాబ్స్‌ను ప్రారంభించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, తెలంగాణ బ్యూరో :** సమాచార సాంకేతిక రంగంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ ముప్పులను ఎదుర్కోవడంలో కృత్రిమ మేధ, సైబర్ భద్రత సాంకేతికతలు కీలక పాత్ర పోషిస్తాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని టీ-వర్క్స్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ భద్రత, కృత్రిమ మేధ రంగ సంస్థ జెన్‌సీ ల్యాబ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిశోధన ఆధారిత నూతన సంస్థలు హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి సమాచార సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దడంలో దోహదపడతాయని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో సంస్థను ప్రారంభించిన వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యనిర్వాహక అధికారి రవి పుత్తా, వారి బృందాన్ని ఎంపీ అభినందించారు. భవిష్యత్తులో సంస్థ మరింత అభివృద్ధి సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెన్‌సీ ల్యాబ్స్ ప్రధాన మార్గదర్శి మురళి తలసిల, అరబిందో ఫార్మా గ్రూప్ సమాచార విభాగం అధికారి చిట్టిబాబు, వాల్యూమోమెంటమ్ సీనియర్ ఉపాధ్యక్షుడు భరత్





అయ్యంగార్‌తో పాటు సైబర్ భద్రత నిపుణులు, సాంకేతిక రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి**

**అన్నారం గోపాల్ రెడ్డి**



**కొంపల్లి, ఆగస్టు 29 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** గణేష్ నిమజ్జన కార్యక్రమానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారం గోపాల్ రెడ్డి కోరారు. ఈ మేరకు కొంపల్లి డిప్యూటీ కమిషనర్ లావణ్యను కలిసి నిమజ్జన ఏర్పాట్లపై పలు అంశాలను వివరించారు. నిమజ్జన మార్గాల్లో రోడ్ల పరిస్థితి, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, విద్యుత్ దీపాలు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వినాయక విగ్రహాలతో వచ్చే భక్తులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే నిమజ్జన సమయంలో భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ రద్దీని ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని గోపాల్ రెడ్డి కోరారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా విజయవంతంగా జరిగేలా అధికారులు అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# శ్రావణ పౌర్ణమి వేళ వైభవంగా లక్ష్మీ-కుబేర హోమం

**వరలక్ష్మీ వ్రతం.. మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, ఓల్డ్ బోయినపల్లి:** శ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా ఓల్డ్ బోయినపల్లిలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ మాసంలోని మూడో శుక్రవారం, పౌర్ణమి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమి వేడుకలు, వివిధ హోమాలు నిర్వహించే సంప్రదాయం ఉంది. ఈ



సందర్భంగా సునంద అపార్ట్‌మెంట్‌లో హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక ప్రతినిధి సంతోష్ కుమార్ పూదరి స్వగృహంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. అలాగే శ్రీ గాయత్రీ జ్యోతిష్యాలయం నిర్వహకులు బ్రహ్మశ్రీ రామేశ్వరపు దుర్గా ఫణి శర్మ స్వగృహంలో ప్రత్యేకంగా గణపతి, నవగ్రహ, లక్ష్మీ--కుబేర హోమాలను నిర్వహించారు. మహాలక్ష్మీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, వేద మంత్రోచ్ఛారణల నడుమ హోమ కార్యక్రమాలను నిర్వహించారు. లక్ష్మీదేవి, కుబేరుని ఆవాహన చేసి ప్రత్యేక మంత్రాలతో పూజలు నిర్వహించి, హోమాగ్నికి పూజా ద్రవ్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా రామేశ్వరపు దుర్గా ఫణి శర్మ మాట్లాడుతూ, లోకకల్యాణం, సమస్త మానవాళి సుఖశాంతులు, సంతోషాలతో ఉండాలనే సంకల్పంతో ఈ హోమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

# రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**బోయిన్‌పల్లి పరిధిలో పంపిణి చేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

**ఆగష్టు 29, బోయిన్పల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల



పంపిణీ కార్యక్రమం శనివారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బోయిన్‌పల్లి లోని యాదవ్ భవన్ లో జరిగింది. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సెవెన్ టెంపుల్స్, సీతారామపురం, పెద్ద తోకట్ట, బాపూజీ నగర్, పెన్షన్ లైన్ ప్రాంతాల్లోని రేషన్ షాపుల పరిధిలో ఉన్న రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత పారదర్శకంగా, సులభంగా సంక్షేమ పథకాలు అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీఎస్ఓ, ఏఎస్ఓలు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రేషన్ డీలర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మనిషిలోనే దేవుడు..మానవసేవే మహోన్నత పూజ!

**దత్తగిరి ఆశ్రమంలో వైభవంగా మృత్యుంజయ లక్ష జప మహాయజ్ఞం**

**లోకకల్యాణం, సకల జీవుల ఆరోగ్యం-శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, ఝరాసంగం :** ప్రతి మనిషిలోనూ దైవత్వం ఉందని, దేహమే దేవాలయం.. జీవుడే దేవుడనే భావనతో మానవసేవకు అంకితం కావాలని బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహారాజ్, సిద్ధేశ్వరానందగిరి, ఆధ్యాత్మికవేత్త రాచయ్య స్వామి పేర్కొన్నారు. కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా మనుషులందరూ సమానమేననే భావనతో సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.శ్రావణమాసాన్ని పురస్కరించుకుని లోకకల్యాణం, సకల జీవుల ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యం కోసం శనివారం బర్దిపూర్‌లోని దత్తగిరి ఆశ్రమంలో మృత్యుంజయ లక్ష జప మహాయజ్ఞాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

**మంత్రోచ్చారణలతో మార్మోగిన ఆశ్రమం**

ఉదయం 11.45 గంటలకు వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ



పీఠాధిపతులు వేదోక్తంగా యాగశాలలో ప్రవేశించారు. అనంతరం వేద విద్యార్థులు, భక్తులు సామూహికంగా మృత్యుంజయ మంత్రాన్ని లక్షసార్లు జపించారు. ఆధ్యాత్మిక వాతావరణంతో ఆశ్రమ ప్రాంగణం మార్మోగింది.యజ్ఞశాలలో అగ్నిదేవుడికి వివిధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా ఆహుతులు సమర్పిస్తూ మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 2.11 గంటలకు వేదమంత్రాల ఘోష, మంగళవాయిద్యాల నడుమ పూర్ణాహుతి నిర్వహించారు.

**11 మంది దంపతులు యజ్ఞ యజమానులు**

ఈ మహాయజ్ఞంలో 11 మంది దంపతులు యజ్ఞ యజమానులుగా వ్యవహరించారు. భక్తుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో లోకశాంతి,



ప్రజల ఆరోగ్యం, సకల జీవుల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.రాత్రి శివపార్వతుల కళ్యాణం, బసవపురాణ ప్రవచనం, భజన సంకీర్తన కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో నందినిగిరి మాత, ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్ పాటిల్, కోట శ్రీనివాస్, నాగన్న పాటిల్, బి. కృష్ణ, దత్తు, అర్చకులు శ్రీపద్ స్వామి, నాగయ్య స్వామి, వేద పాఠశాల విద్యార్థులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు

# అర్ధరాత్రి ఎమ్మెల్సీ బహిష్కరణపై ప్రశ్నలు.. వివరణ ఇవ్వాలన్న రాజాసింగ్

**మీర్జా రహమత్ బేగ్‌ను పార్టీ నుంచి తొలగించిన ఎంఐఎం.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని ఆదేశం**



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, సిటీ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ బహిష్కరణ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. బేగ్‌ను పార్టీ నుంచి తక్షణమే బహిష్కరిస్తున్నట్లు ఎంఐఎం ప్రకటించడంతో పాటు, తెలంగాణ శాసనమండలి సభ్యత్వానికి వెంటనే రాజీనామా చేయాలని ఆదేశించింది.ఎంఐఎం సంయుక్త కార్యదర్శి ఎస్.ఏ. హుస్సేన్ అన్వర్ పార్టీ నిర్ణయాన్ని ప్రకటించారు. అయితే బేగ్‌పై తీసుకున్న చర్యకు సంబంధించిన నిర్దిష్ట కారణాలను పార్టీ అధికారిక ప్రకటనలో వెల్లడించలేదు.ఈ పరిణామంపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందిస్తూ, అర్ధరాత్రి సమయంలో పార్టీ ఎమ్మెల్సీపై ఇలాంటి చర్య తీసుకోవడానికి కారణాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఎంఐఎం నాయకత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.ఒక మైనర్ బాలికకు సంబంధించిన తీవ్రమైన ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న వీడియో అంశంపై కూడా రాజాసింగ్ ప్రశ్నలు లేవనెత్తారు. అయితే ఈ ఆరోపణలపై స్వతంత్ర అధికారిక దర్యాప్తు ఫలితాలు లేదా న్యాయస్థాన నిర్ధారణ వెలువడినట్లు స్పష్టమైన సమాచారం లేదు. అందువల్ల ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించలేము.మరోవైపు, బేగ్ ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు తనను బెదిరించి, డబ్బు డిమాండ్ చేశారని, మార్ఫింగ్ చేసిన చిత్రాలు లేదా డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తామని బెదిరించారని సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించినట్లు పలు మీడియా నివేదికలు తెలిపాయి. ఈ పరిణామాల అనంతరం ఆయనను పార్టీ నుంచి బహిష్కరించడం రాజకీయంగా మరింత చర్చకు దారితీసింది.మీర్జా రహమత్ బేగ్ హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి తెలంగాణ శాసనమండలికి ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయనను పార్టీ నుంచి తొలగించినప్పటికీ, శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేసే అంశంపై తదుపరి పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

**అధికారిక వివరణ కోసం ఎదురుచూపు**

బేగ్ బహిష్కరణకు గల పూర్తి కారణాలపై ఎంఐఎం ఇప్పటివరకు విస్తృత వివరణ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే పోలీసు దర్యాప్తు లేదా అధికారిక ప్రకటనల ద్వారా స్పష్టత రావాల్సి ఉంది.

# హలో మాల..చలో సచివాలయం

**మాలల విద్య, ఉద్యోగ అవకాశాలకు అడ్డంకిగా మారిన రోస్టర్ విధానాన్ని సవరించాలి.**

**99 జీవోను రద్దు చేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 29, పాల్వంచ:** మాలల విద్య, ఉద్యోగ అవకాశాలకు అడ్డంకిగా మారిన రోస్టర్ విధానాన్ని వెంటనే సవరించాలని, వారి భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆరోపిస్తున్న 99 జీవోను రద్దు చేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మాలల విద్య, ఉద్యోగ అవకాశాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలని కోరుతూ సోమవారం నిర్వహించనున్న చలో సచివాలయం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించి శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని లారీ అసోసియేషన్‌లో నిర్వహించిన సమావేశంలో హలో మాల-చలో సచివాలయం కరపత్రాలను ఆవిష్కరించారు.జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పిల్లి సుధాకర్ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ పాయింట్ల కేటాయింపు, 99 జీవో అమలు వల్ల మాలలకు విద్య, ఉద్యోగ రంగాల్లో నష్టం జరుగుతోందని ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం మాలలకు కేటాయించిన ఐదు శాతం రిజర్వేషన్ పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపు విధానాన్ని పునఃసమీక్షించాలని, 99 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.మాలల డిమాండ్ల సాధన కోసం సోమవారం నిర్వహించనున్న చలో సచివాలయం కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా



మాల విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుమల్ల సుందర్రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడెల్లి గణపతి, జిల్లా ఉపాధ్యక్షులు పల్లంటి రమేష్, సింగరేణి రిటైర్డ్ మేనేజర్ శనగ వెంకటేశ్వర్లు, నాయకులు పెంకి శ్రీనివాస్, కాలే పుల్లయ్య, కూరపాటి దాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బోడ దివ్య, జిల్లా నాయకులు గుర్రం వెంకటరత్నం, రామచందర్, వల్లంటి హరీష్, సుధాకర్, ప్రభాకర్, శెట్టి కమలాకర్, కాంతయ్య, గొల్లమల్ల రత్నం, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు వాసుమల్ల గౌతం, దారా సాత్విక్, గుండమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు

**విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన డాక్టర్ వైద్యనాథ్..**




**హైదరాబాద్ పల్స్ న్యూస్ 29 ఆగస్టు, సంగారెడ్డి :** వ్యవసాయ రంగంలో ఉన్నత విద్య, ఉద్యోగ, వ్యాపార అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వైద్యనాథ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ వైద్యనాథ్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో యువతకు అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాలు, ఆధునిక సాగు పద్ధతులు, క్షేత్రస్థాయిలో వినూత్న ఆలోచనలు వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు దోహదపడుతున్నాయని వివరించారు.వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. వ్యవసాయ సాంకేతికత, వ్యవసాయ ఆధారిత వ్యాపార రంగాల్లోనూ యువతకు మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిలకడైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో యువ వ్యవసాయ నిపుణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పౌర సరఫరాల విజిలెన్స్ పర్యవేక్షణ కమిటీ డైరెక్టర్ డాక్టర్ సామ్రాట్ గోవర్ధన్, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ పర్యవేక్షకులు ఎస్. శాంతకుమార్, సీనియర్ సహాయకులు శ్యామ్‌సుందర్, ముఖీమ్‌బేగం, జూనియర్ సహాయకులు రాజు, వ్యవసాయ విస్తరణ అధికారి బి. శ్రీకాంత్, వ్యవసాయ విద్యార్థి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ వైద్యనాథ్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు, అధ్యాపక బృందం అతిథులకు ఆతిథ్యం అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మణుగూరు జెడ్పీటీసీ బరిలో గురిజాల గోపి..?

**కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై రాజకీయ వర్గాల్లో చర్చ.**

**రేణుకా చౌదరి, బలరాం నాయక్ ఆశీస్సులతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టే అవకాశం..?**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 29, మణుగూరు:** మణుగూరు జెడ్పీటీసీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గురిజాల గోపి పోటీ చేసే అవకాశం ఉందంటూ రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరికి సన్నిహిత అనుచరుడిగా గుర్తింపు పొందిన గురిజాల గోపి పేరు కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం పరిశీలనలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన నాయకులకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో మణుగూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న గురిజాల గోపి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

**ప్రజా సేవా కార్యక్రమాలతో గుర్తింపు**

గత కొన్నేళ్లుగా మండలంలోని నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు, ఆర్థిక సహాయం అందించడం వంటి సేవా కార్యక్రమాల ద్వారా



గురిజాల గోపి ప్రజల్లో గుర్తింపు పొందారని ఆయన అనుచరులు చెబుతున్నారు. బీసీ నాయకుడిగా వివిధ వర్గాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటం కూడా ఆయనకు రాజకీయంగా కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు.మణుగూరు మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో ఆయనకు పరిచయాలు, పార్టీ కార్యకర్తలతో సంబంధాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ సమావేశాలు, కార్యక్రమాలకు తక్కువ సమయంలోనే పెద్ద సంఖ్యలో కార్యకర్తలను సమీకరించే సామర్థ్యం ఉన్న నాయకుడిగా కూడా గోపికి గుర్తింపు ఉందని ఆయన మద్దతుదారులు అంటున్నారు.

**అభ్యర్థిత్వంపై తుది నిర్ణయం అధిష్టానానిదే**

అయితే మణుగూరు జెడ్పీటీసీ అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ పార్టీ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. అభ్యర్థుల ఎంపికపై పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయినప్పటికీ, రేణుకా చౌదరి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ ఆశీస్సులు, మద్దతుతో గురిజాల గోపి ఈసారి జెడ్పీటీసీ ఎన్నికల బరిలో నిలిచే అవకాశం ఉందని

**రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.**

త్వరలో మణుగూరుకు రేణుకా, బలరాం నాయక్..? ఇదిలా ఉండగా రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ త్వరలో మణుగూరు మండలంలో పర్యటించే అవకాశం ఉందని సమాచారం. వారి పర్యటనకు సంబంధించి అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.వారి పర్యటన ఖరారైతే కాంగ్రెస్ పార్టీ నాయకుడు గురిజాల గోపి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# దివ్యాంగుల ఆరు వేల పెన్షన్ హామీ అమలుపై రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు

**రూ.6 వేల పెన్షన్ హామీ ఏమైంది?.. అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నిస్తామని వెల్లడి**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, హైదరాబాద్ :** దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పెన్షన్ అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఉప సభానేత హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలపై రానున్న శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు.హస్తినాపురంలోని జీఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమర శంఖారావం సభలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో దివ్యాంగుల కోసం ఇచ్చిన హామీల అమలు, పెన్షన్ల పెంపు, వెనుకబడిన ఖాళీల భర్తీ, ఉచిత బస్సు ప్రయాణం వంటి అంశాలపై ప్రభుత్వంపై విమర్శలు చేశారు.దివ్యాంగుల సంక్షేమానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందని, పెన్షన్ మొత్తాన్ని పెంచడంతో పాటు విద్య, ఉపాధి రంగాల్లో అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దివ్యాంగుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని హరీశ్‌రావు తెలిపారు. అవసరమైతే హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద దివ్యాంగులతో కలిసి భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని






ప్రకటించారు.దివ్యాంగుల సమస్యలపై పార్టీ తరఫున ప్రత్యేక కార్యాచరణ చేపడతామని, వారి హక్కుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు అంశాన్ని పార్టీ నాయకత్వంతో చర్చిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

## ఇద్దరిపై దాడి.. ఐదుగురిపై ఫిర్యాదు

### మన్నేగూడెం ఘటనపై డోర్నకల్ పోలీసులను ఆశ్రయించిన బాధితులు

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :** సీరోల్ మండలం మన్నేగూడెం గ్రామానికి చెందిన లింగనబోయిన వెంకటేష్, నల్లబెల్లి సాయికుమార్‌పై శనివారం దాడి జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూజల భాస్కర్, కపిల్, పద్మ, సునిత, సాయి అనే ఐదుగురిపై బాధితులు డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల ప్రకారం.. ఏదో విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో తమపై ఐదుగురు దాడికి పాల్పడ్డారని తెలిపారు. అకస్మాత్తుగా దాడి చేయడంతో తాము ప్రతిఘటించలేకపోయామని, కర్రలతో కొట్టడంతో గాయాలైనట్లు పేర్కొన్నారు. ఘటన సమయంలో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురైనట్లు తెలిపారు. దాడి అనంతరం బాధితులు డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి జరిగిన విషయాన్ని వివరించారు. తమపై దాడి చేసిన వారిపై విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు తమకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. బాధితుల ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, దాడికి దారితీసిన కారణాలపై విచారణ చేపట్టాల్సి ఉంది. విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఎక్సైజ్ వాహనాల వేలం తేదీ మార్పు

### సెప్టెంబర్ 1కు బదులుగా సెప్టెంబర్ 2న నిర్వహణ




**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** వివిధ ఎక్సైజ్ నేరాలకు సంబంధించి పట్టుబడిన వాహనాల వేలం తేదీని మార్చినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో సెప్టెంబర్ 1, 2026న నిర్వహించాల్సిన వాహనాల వేలాన్ని సెప్టెంబర్ 2, 2026న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి పి. కరంచంద్ ఆదేశాల మేరకు వేలం ప్రక్రియ నిర్వహించనున్నట్లు మహబూబాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి. చిరంజీవి తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల వ్యక్తులు తేదీ మార్పును గమనించి, సెప్టెంబర్ 2న నిర్ణీత సమయంలో మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణకు హాజరుకావాలని అధికారులు సూచించారు.

## పరుగు పందెంలో వెండి పతకం సాధించిన కవేలి హారిక

### బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి ఘన సన్మానం




**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, జహీరాబాద్ :** బాసర రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ)లో మొదటి సంవత్సరం చదువుతున్న ఖానాపూర్ గ్రామానికి చెందిన కవేలి హారిక పరుగు పందెం పోటీలో ద్వితీయ స్థానం సాధించి వెండి పతకాన్ని కైవసం చేసుకుంది.కవేలి అశోక్, మంజుల కుమార్తె అయిన హారిక చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ గ్రామానికి గర్వకారణంగా నిలుస్తోంది. తెలంగాణ రైజింగ్ కార్యక్రమంలో భాగంగా, విద్యార్థినులను క్రీడల వైపు ప్రోత్సహించే ఉద్దేశంతో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాసర ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఆమె పాల్గొని పరుగు పందెంలో ద్వితీయ బహుమతి సాధించింది.ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో హారికకు ప్రశంసాపత్రం, వెండి పతకాన్ని అందజేసి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆమె ప్రతిభను ప్రశంసిస్తూ, భవిష్యత్తులోనూ చదువుతోపాటు క్రీడల్లో రాణించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. హారిక సాధించిన విజయంపై ఖానాపూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ఒకే దేశం-ఒకే ఎన్నికలు నిర్వహించాలి

### జమిలి ఎన్నికలకు మద్దతు తెలిపిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు

### మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీల పెన్షన్ల రద్దుపై కూడా డిమాండ్

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, బోడుప్పల్:** దేశవ్యాప్తంగా తరచూ ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రజాధనం భారీగా ఖర్చవుతోందని, లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించే విధానంపై అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని హైదరాబాద్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలిపాక శ్రీనివాస్, బాలాజీ సింగ్ కోరారు.ఒకే దేశం-ఒకే ఎన్నికల విధానం అమలైతే ఎన్నికల నిర్వహణకు అయ్యే వ్యయం తగ్గడంతో పాటు, తరచూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడం వల్ల అభివృద్ధి పనులకు కలిగే అంతరాయాలు తగ్గుతాయని వారు అభిప్రాయపడ్డారు. ఎన్నికల విధుల్లో భద్రతా సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులను పదేపదే వినియోగించాల్సిన అవసరం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.2034 కంటే ముందుగానే దేశంలో జమిలి ఎన్నికల విధానం అమలులోకి రావాలని వారు కోరారు. ఒకే దేశం-ఒకే ఎన్నికల అంశంపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీలో పలువురు పార్లమెంట్ సభ్యులు పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు.


**2029 ఎన్నికలతో జమిలి ఎన్నికలు నిర్వహించాలి**

2029లో జరిగే లోక్‌సభ ఎన్నికలతో పాటు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను కూడా ఒకేసారి నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ప్రజాధనం వృథా కాకుండా చూసేందుకు అన్ని రాజకీయ పార్టీల అధినేతలు జమిలి ఎన్నికల నిర్వహణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.అదే సమయంలో మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలకు అందిస్తున్న పెన్షన్ల అంశాన్ని పునఃసమీక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఆ నిధులను కార్మికులు, నిరుద్యోగ యువత, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమానికి వినియోగించాలని సూచించారు.

**కార్మికులు, నిరుద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించాలి**

అసంఘటిత రంగ కార్మికులు, గుమస్తాలు, నిరుద్యోగ యువతకు ఆర్థిక భరోసా కల్పించే పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తరించాలని కొలిపాక శ్రీనివాస్, బాలాజీ సింగ్ కోరారు. ఇళ్లు లేని నిరుపేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి గృహ పథకాల ద్వారా మరింత సహాయం అందించాలని సూచించారు.దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైనికుల సేవలు అమూల్యమైనవని పేర్కొంటూ, వారి సంక్షేమానికి ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అయ్యేలా పార్లమెంటులో ఒకే దేశం--ఒకే ఎన్నికల అంశంపై విస్తృత చర్చ జరిపి, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ ద్వారా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా హైదరాబాద్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకుడు, రేవంత్ రెడ్డి సైన్యం సామాజిక మాధ్యమాల కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్, హైదరాబాద్ రాహుల్ టీం అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకుడు బాలాజీ సింగ్ తమ అభిప్రాయాలను వెల్లడించారు.






# మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో ఆసక్తికర అంచనాలు..ప్రధాని ఎంపికలో మోదీ ముందంజ

### బీజేపీ సీట్లలో తగ్గుదల అంచనా.. కాంగ్రెస్‌కు పెరుగుతున్న మద్దతు

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, సెంట్రల్ డెస్క్:** ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే దేశ రాజకీయ పరిస్థితి ఎలా ఉండవచ్చనే అంశంపై నిర్వహించిన తాజా 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే ఆసక్తికర అంచనాలను వెల్లడించింది. సర్వే ప్రకారం భారతీయ జనతా పార్టీ అతిపెద్ద పార్టీగా కొనసాగుతున్నప్పటికీ, గత అంచనాలతో పోలిస్తే దాని సీట్ల సంఖ్యలో కొంత తగ్గుదల కనిపించవచ్చని పేర్కొంది.సర్వే అంచనాల ప్రకారం బీజేపీకి 261 లోక్‌సభ స్థానాలు, కాంగ్రెస్‌కు 106 స్థానాలు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. కూటముల పరంగా ఎన్డీయేకు 326 స్థానాలు, ఇండియా కూటమికి 185 స్థానాలు రావచ్చని అంచనా వేసింది.

**ప్రధాని ఎంపికలో మోదీకి ఆధిక్యం**

దేశానికి ప్రధాని ఎవరు కావాలనే ప్రశ్నకు నరేంద్ర మోదీకి 49 శాతం మంది మద్దతు తెలిపినట్లు సర్వే పేర్కొంది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి 27 శాతం మంది మద్దతు లభించినట్లు వెల్లడించింది.ఈ గణాంకాలు జాతీయ రాజకీయాల్లో ఇప్పటికీ మోదీ ప్రభావం కొనసాగుతున్నట్లు సూచిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్ష పార్టీగా




కాంగ్రెస్‌కు మద్దతు పెరుగుతున్నట్లు సర్వే అంచనాలు సూచిస్తున్నాయి.

**ఇండియా కూటమి నాయకత్వంపై చర్చ**

ఇండియా కూటమికి ఎవరు నాయకత్వం వహిస్తే బాగుంటుందనే ప్రశ్నకు రాహుల్ గాంధీకి అత్యధికంగా 29 శాతం మంది మద్దతు తెలిపినట్లు సమాచారం. తమిళ నటుడు, రాజకీయ నాయకుడు విజయ్‌కు 12 శాతం మంది మద్దతు తెలిపినట్లు సర్వేలో పేర్కొన్నారు.విజయ్ పేరు జాతీయ రాజకీయ నాయకత్వానికి సంబంధించిన ప్రశ్నల్లో ప్రస్తావనకు రావడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల తమిళనాడు రాజకీయాల్లో తన రాజకీయ పార్టీ ద్వారా విజయ్ చురుకైన పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే.

**సర్వేలపై భిన్నాభిప్రాయాలు**

అయితే ఎన్నికలకు చాలా కాలం ముందే నిర్వహించే రాజకీయ సర్వేలు వాస్తవ ఎన్నికల ఫలితాలను పూర్తిస్థాయిలో ప్రతిబింబించకపోవచ్చని గత అనుభవాలు చెబుతున్నాయి. నమూనాల ఎంపిక, సర్వే విధానం, ప్రశ్నల రూపకల్పన వంటి అంశాలు ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.దేశ రాజకీయ పరిస్థితులు, ప్రాంతీయ పార్టీల వ్యూహాలు, కూటముల మార్పులు, ఎన్నికల సమయానికి ఏర్పడే ప్రజాభిప్రాయం వంటి అంశాలు తుది ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాయి.

**ఎన్నికల వరకు మారే రాజకీయ సమీకరణాలు**

రాబోయే కాలంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలు, జమిలి ఎన్నికల వంటి అంశాలపై దేశ రాజకీయాల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది. ఈ అంశాలపై ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు తీసుకునే నిర్ణయాలు భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

### ఉగ్రవాదం–తీవ్రవాదం–వేర్పాటువాదం..

# దేశ భద్రతకు మూడు ప్రధాన సవాళ్లు

### విష భావజాలం నుంచి హింస వరకు.. ప్రపంచ దేశాలు సమష్టిగా ఎదుర్కోవాల్సిన ముప్పు

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, సెంట్రల్ డెస్క్:** ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం లక్ష్యాలు, రూపాలు వేర్వేరుగా కనిపించినప్పటికీ దేశాల భద్రత, సామాజిక సామరస్యం, ప్రజాస్వామ్య వ్యవస్థలకు తీవ్ర ముప్పుగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ మూడు సవాళ్లను విడివిడిగా కాకుండా పరస్పరం అనుసంధానమైన సమస్యలుగా పరిగణించి ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

**ఉగ్రవాదం అంటే ఏమిటి?**

రాజకీయ, మతపరమైన లేదా ఇతర లక్ష్యాల సాధన కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టించే హింసాత్మక చర్యలను సాధారణంగా ఉగ్రవాదంగా పరిగణిస్తారు. ఇటువంటి చర్యలు అమాయక ప్రజల ప్రాణాలకు, దేశ భద్రతకు తీవ్ర నష్టం కలిగిస్తాయి.

**తీవ్రవాదం ఎలా విస్తరిస్తుంది?**

ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను తిరస్కరిస్తూ హింస లేదా ద్వేషాన్ని సమర్థించే కఠిన భావజాలాలను తీవ్రవాదంగా పేర్కొంటారు. యువతను ఇటువంటి భావజాలాల వైపు మళ్లించేందుకు సామాజిక మాధ్యమాలు, డిజిటల్ వేదికలను దుర్వినియోగం చేసే ప్రమాదం కూడా పెరుగుతోందని భద్రతా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వేర్పాటువాదం.. దేశ సమగ్రతకు సవాలు**

ఒక దేశంలోని ప్రాంతాన్ని విడదీసి ప్రత్యేక రాజకీయ వ్యవస్థ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో జరిగే ఉద్యమాలు, కార్యకలాపాలను వేర్పాటువాదంగా పేర్కొంటారు. ఇటువంటి ధోరణులు దేశ ప్రాదేశిక సమగ్రత, అంతర్గత భద్రతకు సవాలుగా మారవచ్చు.



**మూడు సమస్యల మధ్య సంబంధం**

తీవ్ర భావజాలం వ్యక్తుల ఆలోచనలను ప్రభావితం చేయవచ్చు. ఆ భావజాలం హింసాత్మక రూపం దాల్చినప్పుడు ఉగ్రవాద కార్యకలాపాలకు దారితీసే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఇటువంటి హింసాత్మక లేదా విద్రోహ భావజాలాలను వేర్పాటువాద లక్ష్యాల కోసం వినియోగించే పరిస్థితులు కూడా ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు.

**డిజిటల్ ప్రపంచంలో కొత్త సవాలు**

ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల విస్తరణతో విద్వేషపూరిత, తీవ్ర భావజాల ప్రచారం వేగంగా వ్యాపించే ప్రమాదం ఉంది. యువతను తప్పుదారి పట్టించే ప్రచారాన్ని గుర్తించడం, చట్టబద్ధంగా అడ్డుకోవడం, అదే సమయంలో డిజిటల్ అవగాహన పెంచడం ప్రభుత్వాలు, సమాజం ముందున్న ప్రధాన సవాలుగా మారింది.


**సమష్టి పోరాటమే మార్గం**

ఉగ్రవాదానికి ఆర్థిక వనరులను అడ్డుకోవడం, సరిహద్దు భద్రతను బలోపేతం చేయడం, దేశాల మధ్య సమాచార మార్పిడి పెంచడం, యువతలో శాంతి, సామరస్యం, రాజ్యాంగ విలువలపై అవగాహన పెంచడం ద్వారా ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.దేశ భద్రత, సామాజిక ఐక్యత, ప్రపంచ శాంతి కోసం ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం వంటి అన్ని రకాల హింసాత్మక, విద్రోహ ధోరణులపై ప్రపంచ దేశాలు సమష్టిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆకస్మిక వరదల వేళ అండగా నిలిచిన భారత్.. నేపాల్ అధ్యక్షుడి కృతజ్ఞతలు

**ప్రకృతి విపత్తు సమయంలో భారత సహకారాన్ని ప్రశంసించిన రామ్‌చంద్ర పౌడెల్**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29:**
నేపాల్‌లో ఇటీవల సంభవించిన ఆకస్మిక వరదలు, ప్రకృతి విపత్తు సమయంలో భారత్ అందించిన సహకారం, సంఘీభావానికి నేపాల్ అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ కృతజ్ఞతలు తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అండగా నిలిచిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ధన్యవాదాలు తెలియజేస్తూ సామాజిక మాధ్యమ వేదికగా స్పందించారు.ప్రకృతి విపత్తు సమయంలో భారత్ అందించిన మద్దతు తమకు ఎంతో ముఖ్యమైనదని పౌడెల్ పేర్కొన్నారు. పొరుగు దేశంగా భారత్ చూపించిన మానవతా దృక్పథాన్ని ప్రశంసిస్తూ, అందించిన సహకారం, సంఘీభావానికి కృతజ్ఞతలు తెలిపారు.ఇదే సమయంలో ఆగస్టు 26న జరిగిన దుర్ఘటనలో భారతీయులు కూడా ప్రాణాలు కోల్పోవడంపై నేపాల్ అధ్యక్షుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు నేపాల్ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రకృతి విపత్తుల్లో సంభవించే ప్రాణనష్టం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు.నేపాల్‌లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ఘటనలతో పలు ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అనేక గ్రామాలు, రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో సాధారణ జనజీవనం స్తంభించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కొనసాగుతున్నాయి.విపత్తు తీవ్రత నేపథ్యంలో నేపాల్ ప్రభుత్వం సహాయక, రక్షణ చర్యలను ముమ్మరం చేసింది. బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సహాయం వంటి అత్యవసర సేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. ప్రతికూల వాతావరణం, దెబ్బతిన్న రహదారులు సహాయక చర్యలకు సవాళ్లుగా మారుతున్నాయి.భారీ వర్షాలు, వరదల ముప్పు పూర్తిగా తొలగిపోకపోవడంతో ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు కొనసాగిస్తున్నారు.ప్రకృతి విపత్తు సమయంలో నేపాల్‌కు భారత్ అందించిన మద్దతుపై అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ కృతజ్ఞతలు తెలపడం రెండు దేశాల మధ్య ఉన్న స్నేహపూర్వక, మానవీయ సంబంధాలకు నిదర్శనంగా నిలిచింది.



# పంచాయతీ కార్యదర్శిపై దాడి ఘటన.. బాధ్యుడిని వెంటనే అరెస్టు చేయాలి

**బిబిపేట్ సర్పంచ్ భర్తపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: చిరంజీవి**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, నారాయణఖేడ్ :**
కల్హేర్ మండలం బిబిపేట్ గ్రామపంచాయతీ కార్యదర్శిపై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఎస్. చిరంజీవి డిమాండ్ చేశారు.ప్రభుత్వ విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై దాడి జరగడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై ఇలాంటి దాడులు వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని, ఇటువంటి ఘటనలను సహించరాదని అన్నారు.బిబిపేట్ గ్రామపంచాయతీ సర్పంచ్ భర్తగా పేర్కొంటున్న వ్యక్తి పంచాయతీ కార్యదర్శిపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి భయాందోళనలు లేకుండా ప్రజలకు సేవలందించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని, బాధిత పంచాయతీ కార్యదర్శికి న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని చిరంజీవి డిమాండ్ చేశారు.పంచాయతీ కార్యదర్శికి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.



# కలెక్టరేట్ ముట్టడిస్తాం.. 22ఏ జాబితా నుంచి తొలగించే వరకు వంటావార్పు: హరీశ్ రావు హెచ్చరిక

**పటాన్‌చెరు పరిధిలో లక్ష ఇళ్లు, 50 వేల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని ఆరోపణ**

**పటాన్‌చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 29:**
వారం రోజుల్లో 22ఏ నిషేధిత జాబితా సమస్యను పరిష్కరించకపోతే సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడించి వంటావార్పు నిర్వహిస్తామని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు హెచ్చరించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున భూములు, ఇళ్లు 22ఏ జాబితాలో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన 22ఏ భూముల బాధితుల సమావేశంలో హరీశ్ రావు పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇతర నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.




**బాధితుల ఆవేదన**
సమావేశంలో పలువురు బాధితులు తమ సమస్యలను హరీశ్ రావు దృష్టికి తీసుకువచ్చారు. దశాబ్దాలుగా నివసిస్తున్న ఇళ్లు, భూములు నిషేధిత జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని, ఆస్తుల లావాదేవీలు, బ్యాంకు రుణాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. సింఫోని కాలనీ, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన వారు తమ సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, పటాన్‌చెరు నియోజకవర్గంలో సుమారు లక్ష ఇళ్లు, ఐదు మండలాల్లో కలిపి 50 వేల ఎకరాలకు పైగా భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని ఆరోపించారు.గుమ్మడిదలలో 12,432 ఎకరాలు, అమీన్‌పూర్‌లో 3,200 ఎకరాలు, రామచంద్రాపురంలో 8,300 ఎకరాలు, పటాన్‌చెరులో 12,300 ఎకరాలు, జిన్నారంలో 13,900 ఎకరాలు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం 50,565 ఎకరాల భూములకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వంపై విమర్శలు**
దశాబ్దాలుగా కాలనీల్లో నివసిస్తున్న ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల వారి జీవితాలపై ప్రభావం పడుతోందని హరీశ్ రావు విమర్శించారు. గతంలో వివిధ ప్రభుత్వ అనుమతులు, విద్యుత్, నీటి కనెక్షన్లు ఇచ్చి, పన్నులు వసూలు చేసిన ఆస్తులపై ప్రస్తుతం వివాదాలు తలెత్తడం వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన ఆస్తుల విషయంలో కూడా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాధారణ ప్రజల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించే విషయంలో ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోవాలని కోరారు.

**వారం రోజుల్లో పరిష్కరించాలని డిమాండ్**
పటాన్‌చెరు నియోజకవర్గానికి సంబంధించిన నిషేధిత జాబితా వివరాలను స్థానిక ఎమ్మెల్యే సంగారెడ్డి జిల్లా అధికారులకు అందజేస్తారని హరీశ్ రావు తెలిపారు. వారం రోజులలోగా సంబంధిత భూములు, ఇళ్ల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నిర్దేశిత గడువులో సమస్య పరిష్కారం కాకపోతే రైతులు, ఇళ్ల యజమానులు, బాధితులను సమీకరించి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించే వరకు అక్కడే వంటావార్పు నిర్వహించి ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

# జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో నినాదాలపై సీఎం సువేందు అధికారి విమర్శలు

**‘ఆజాదీ’, కిషన్‌జీ, పాలస్తీనా అనుకూల నినాదాలపై అభ్యంతరం**



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, కోల్‌కతా:**
జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో వినిపిస్తున్న కొన్ని రాజకీయ నినాదాలు, గోడలపై ఉన్న రాతలు, చిత్రాలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రక్షాబంధన్ సందర్భంగా విశ్వవిద్యాలయం సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.విశ్వవిద్యాలయంలో కిషెన్‌జీకి సంబంధించిన ‘లాల్ సలాం’ నినాదాలు, ‘ఆజాదీ’ నినాదాలు, పాలస్తీనాకు మద్దతుగా ఉన్న సందేశాలపై ఆయన విమర్శలు చేశారు. ఇటువంటి నినాదాలు విద్యార్థులకు ఎలాంటి సందేశాన్ని అందిస్తున్నాయనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు.జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో నెలకొన్నట్లు తాను పేర్కొన్న బెదిరింపు సంస్కృతిని అంతం చేయాల్సిన సమయం వచ్చిందని సువేందు అధికారి అన్నారు. విశ్వవిద్యాలయం లోపల, వెలుపల జాతీయవాద భావాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.కశ్మీర్‌కు సంబంధించిన నినాదాలు, పాలస్తీనా అంశంపై విద్యార్థి వర్గాల్లో జరుగుతున్న రాజకీయ చర్చలపైనా ఆయన స్పందించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ అంశాన్ని కూడా ప్రస్తావించారు.ఇటీవల జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో రాజకీయ నినాదాలు, గోడలపై రాతలు, విద్యార్థి సంఘాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ అంశంపై వివిధ రాజకీయ, విద్యార్థి సంఘాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యే అవకాశం ఉంది.

# 1,600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం.. నాటు సారా తయారీదారు అరెస్ట్

**కురవి పోలీసుల దాడిలో 10 లీటర్ల కాచిన నాటు సారా స్వాధీనం**



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
కురవి పోలీస్‌స్టేషన్ పరిధిలో నాటు సారా తయారీపై పోలీసులు దాడి నిర్వహించి భారీగా బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నాటు సారా కాచుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.ఎస్సై సతీష్ ఆధ్వర్యంలో శనివారం జగ్యా తండా గ్రామ శివారులోని గుట్టల్లో తనిఖీలు నిర్వహించారు. నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన ఎనిమిది డ్రమ్ముల్లోని 1,600 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు గుర్తించి ధ్వంసం చేశారు. దీని విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని ఎస్సై సతీష్ తెలిపారు. అదే ప్రాంతంలో 10 లీటర్ల కాచిన నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.4 వేలు ఉంటుందని పేర్కొన్నారు. నాటు సారా తయారు చేస్తున్న జగ్యా తండాకు చెందిన బానోత్ రెడ్డి (30)ని అరెస్ట్ చేశారు. నిందితుడిపై క్రైమ్ నంబర్ 169/2026 కింద కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు కురవి పోలీసులు తెలిపారు.

# యూపీలో దారుణం.. కన్నతల్లిపై కుమారుడి లైంగిక దాడి ఆరోపణ

**మద్యం మత్తులో ఘటనకు పాల్పడ్డాడని ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు**



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, సెంట్రల్ డెస్క్ :**
ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో అత్యంత దారుణ ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఓ వ్యక్తి తన కన్నతల్లిపైనే లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.సికంద్రరావు కొత్వాలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎటతా రోడ్డులో ఉన్న ఓ గ్రామంలో 63 ఏళ్ల మహిళ తన ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 27న చిన్న కుమారుడు మద్యం సేవించి ఇంటికి వచ్చాడని సమాచారం. అనంతరం నిద్రిస్తున్న తల్లిపై దాడికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఘటన అనంతరం బాధితురాలు తన పెద్ద కుమారుడికి విషయం చెప్పడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచిన తర్వాత న్యాయస్థాన ఆదేశాల మేరకు న్యాయస్థాన కస్టడీకి తరలించినట్లు సమాచారం.

# ఒడిశాలో కలకలం.. వైద్య పరీక్షల్లో 9వ తరగతి విద్యార్థిని గర్భవతి అని వెల్లడి

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 29, సెంట్రల్ డెస్క్:**
ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో ఒక నివాస పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి బాలిక గర్భవతి అని సాధారణ ఆరోగ్య పరీక్షల్లో గుర్తించిన ఘటన కలకలం రేపింది. బాలిక సుమారు ఐదు నెలల గర్భవతి అని వైద్య పరీక్షల్లో తేలినట్లు సమాచారం.పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షల సందర్భంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అనంతరం పాఠశాల సిబ్బంది బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు.వేసవి సెలవుల సమయంలో తనకు పాఠాలు చెప్పేందుకు వచ్చిన ఒక ప్రైవేట్ ఉపాధ్యాయుడు తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాలిక కుటుంబ సభ్యులకు తెలిపినట్లు సమాచారం. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు శాఖల సమీక్షా సమావేశంలో మంత్రులతోపాటు పాల్గొన్న బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, హౌసింగ్ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు--భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వేకు సంబంధించిన శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీరితో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... ఆలేరు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, సర్వేలు, రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ రికార్డుల సవరణ, పట్టాదారు పాస్‌బుక్‌లు తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు తమ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు, ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. ఆలేరు నియోజకవర్గంలో రోడ్లు, భవనాలు, సాగునీరు, తాగునీరు, గృహ నిర్మాణం, రెవెన్యూ సమస్యలు వంటి ప్రజలకు సంబంధించిన ప్రధాన అంశాలను సమావేశంలో వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రులను కోరారు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలని బీర్ల ఐలయ్య సూచించారు.

## వసంతరాణి అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండలం మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన నాగరిగారి ప్రితం మాతృమూర్తి వసంతరాణి మృతిచెందడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వారి స్వగ్రామమైన మాసాన్‌పల్లిలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వసంతరాణి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రితం ని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వసంతరాణి మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని, ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి తన సానుభూతి, మద్దతు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు.


## ఎస్సైని సన్మానించిన ఇంజ మహేష్ మాదిగ

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలనికి బదిలీపై వచ్చిన నూతన ఎస్సై ఎండి తఖియుద్దీన్ ని ఎంఈఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఇంజ మహేష్ మాదిగ శాలువాతో ఘనంగా సత్కరించి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.



# క్వాంటం కంప్యూటింగ్..
# కంప్యూటర్ ప్రపంచాన్ని మార్చబోతున్న సాంకేతిక విప్లవం

### వైద్యం నుంచి అంతరిక్షం వరకు విస్తరించే అవకాశాలు..
### మరోవైపు సైబర్ భద్రతకు కొత్త సవాళ్లు



క్వాంటం కంప్యూటింగ్‌తో అద్భుత అవకాశాలు.. భవిష్యత్తుకు సన్నద్ధం కావాల్సిన అవసరం

**హైదరాబాద్ పల్స్ ప్రత్యేక కథనం, ఆగస్ట్ 29 :** ప్రపంచ సాంకేతిక రంగం మరో కీలక మలుపు దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు మన జీవితాలను మార్చిన సాధారణ కంప్యూటర్ల తర్వాత, ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్ అనే అత్యాధునిక సాంకేతికత పై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు వేగంగా జరుగుతున్నాయి. వైద్యం, ఔషధ పరిశోధన, రసాయన శాస్త్రం, కృత్రిమ మేధస్సు, రవాణా, ఆర్థిక రంగం, అంతరిక్ష పరిశోధన వంటి అనేక రంగాల్లో క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలు కనుగొనే సామర్థ్యం క్వాంటం కంప్యూటింగ్‌కు ఉండవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే ఇదే సాంకేతికత భవిష్యత్తులో ప్రస్తుతం ఉపయోగిస్తున్న కొన్ని గుప్తీకరణ వ్యవస్థలకు సవాలుగా మారే అవకాశం ఉండటంతో ప్రపంచ దేశాలు ఇప్పటికే కొత్త భద్రతా ప్రమాణాల వైపు అడుగులు వేస్తున్నాయి. అమెరికా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాండర్డ్స్ అండ్ టెక్నాలజీ 2024లో తొలి పోస్ట్-క్వాంటం క్రిప్టోగ్రఫీ ప్రమాణాలను విడుదల చేసి, సంస్థలు కొత్త భద్రతా విధానాలకు మారడం ప్రారంభించాలని సూచించింది.

**అసలు క్వాంటం కంప్యూటర్ అంటే ఏమిటి?**

సాధారణ కంప్యూటర్లు సమాచారాన్ని బిట్‌లుగా నిల్వ చేసి ప్రాసెస్ చేస్తాయి. ఒక బిట్ విలువ సాధారణంగా సున్నా లేదా ఒకటిగా ఉంటుంది. క్వాంటం కంప్యూటర్‌లో మాత్రం క్వాంటం బిట్ లేదా క్యూబిట్ ఉపయోగిస్తారు. క్వాంటం భౌతికశాస్త్ర సూత్రాల ఆధారంగా పనిచేసే క్యూబిట్‌లు సాధారణ బిట్‌లకు భిన్నంగా ఉంటాయి. కొన్ని క్వాంటం స్థితుల కలయికలను ఉపయోగించడం ద్వారా ప్రత్యేక రకాల గణన సమస్యలను పరిష్కరించడానికి క్వాంటం కంప్యూటర్లు ప్రయత్నిస్తాయి.

**మూడు ప్రధాన సూత్రాలు:**

**సూపర్‌పొజిషన్:**

క్యూబిట్ ఒకే సమయంలో కేవలం సున్నా లేదా ఒకటి అనే సాధారణ స్థితికి మాత్రమే పరిమితం కాకుండా, కొలతకు ముందు క్వాంటం స్థితుల కలయికలో ఉండగలదు.

**ఎంటాంగిల్‌మెంట్:**

రెండు లేదా అంతకంటే ఎక్కువ క్యూబిట్‌లు ప్రత్యేకమైన క్వాంటం సంబంధాన్ని ఏర్పరుచుకోవచ్చు. ఈ సంబంధం క్వాంటం గణనల్లో కీలక పాత్ర పోషిస్తుంది.

**క్వాంటం ఇంటర్‌ఫెరెన్స్:**

సరైన సమాధానానికి సంబంధించిన అవకాశాన్ని పెంచుతూ, అవసరం లేని ఫలితాల అవకాశాన్ని తగ్గించేలా క్వాంటం అల్గారిథమ్‌లను రూపొందించవచ్చు. ఈ మూడు సూత్రాలే క్వాంటం కంప్యూటింగ్‌కు ప్రత్యేక శక్తిని అందిస్తున్నాయి.

ఎక్కడ ఉపయోగపడుతుంది?

**ఔషధాల అభివృద్ధి:**

కొత్త ఔషధాల రూపకల్పనలో అణువుల ప్రవర్తనను అర్థం చేసుకోవడం చాలా క్లిష్టమైన ప్రక్రియ. సంక్లిష్ట అణు వ్యవస్థల నమూనాలను రూపొందించడంలో క్వాంటం కంప్యూటింగ్ భవిష్యత్తులో ఉపయోగపడే అవకాశం ఉంది.

**కొత్త పదార్థాల తయారీ:**

అత్యుత్తమ బ్యాటరీలు, శక్తి నిల్వ వ్యవస్థలు, సౌరశక్తి పరికరాలు, ప్రత్యేక పారిశ్రామిక పదార్థాల అభివృద్ధికి క్వాంటం అనుకరణలు ఉపయోగపడవచ్చు.

**రవాణా, సరఫరా వ్యవస్థలు:**

అనేక నగరాలు, వాహనాలు, మార్గాలు ఉన్న పరిస్థితుల్లో అత్యుత్తమ మార్గాలను ఎంచుకోవడం అత్యంత క్లిష్టమైన సమస్య. ఇటువంటి గణన సమస్యలకు క్వాంటం విధానాలు ఉపయోగపడే అవకాశం ఉంది.

**కృత్రిమ మేధస్సు:**

కొన్ని ప్రత్యేక గణన సమస్యల్లో కృత్రిమ మేధస్సు పరిశోధనకు క్వాంటం కంప్యూటింగ్ తోడ్పడవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

**సైబర్ భద్రతకు సవాలా?:**

క్వాంటం కంప్యూటింగ్ అభివృద్ధిలో అత్యంత చర్చనీయాంశమైన అంశం సైబర్ భద్రత. ప్రస్తుతం ఇంటర్నెట్‌లో ఉపయోగిస్తున్న కొన్ని ప్రజా కీ గుప్తీకరణ విధానాలు భవిష్యత్తులో శక్తివంతమైన క్వాంటం కంప్యూటర్ల వల్ల ప్రమాదంలో పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ కారణంగానే పోస్ట్-క్వాంటం క్రిప్టోగ్రఫీ అనే కొత్త భద్రతా విధానాల అభివృద్ధి వేగంగా జరుగుతోంది. ఎన్ఐఎస్‌టీ ఇప్పటికే క్వాంటం దాడులను ఎదుర్కొనే గుప్తీకరణ ప్రమాణాలను విడుదల చేసింది. ప్రస్తుతం క్వాంటం కంప్యూటర్లు విస్తృత స్థాయిలో ఈ గుప్తీకరణ వ్యవస్థలను ఛేదించే స్థాయికి చేరుకోకపోయినా, భవిష్యత్తు కోసం ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సంస్థలు సూచిస్తున్నాయి.

**నేటి సమాచారం.. రేపటి ప్రమాదం:**

సైబర్ భద్రతా రంగంలో మరో ముఖ్యమైన ఆందోళన "ఇప్పుడే సేకరించి.. భవిష్యత్తులో డీక్రిప్ట్ చేయడం" అనే విధానం. అంటే ప్రస్తుతం ఛేదించలేని గుప్తీకరించిన సమాచారాన్ని ఎవరైనా నిల్వ చేసుకుని, భవిష్యత్తులో శక్తివంతమైన క్వాంటం కంప్యూటర్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత దానిని చదవడానికి ప్రయత్నించే ప్రమాదం ఉంది. దీర్ఘకాలం విలువ కలిగిన ప్రభుత్వ, ఆర్థిక, వ్యాపార సమాచార రక్షణకు ఇది ముఖ్యమైన అంశంగా మారుతోంది.

**క్వాంటం కంప్యూటర్లు ఇంకా ఎందుకు అందరికీ అందుబాటులో లేవు?**

క్వాంటం కంప్యూటింగ్‌లో ఇప్పటికీ అనేక సాంకేతిక సమస్యలు ఉన్నాయి. క్యూబిట్‌లు అత్యంత సున్నితమైనవి. చిన్నపాటి బాహ్య ప్రభావాలు కూడా వాటి క్వాంటం స్థితిని దెబ్బతీయవచ్చు. దీనివల్ల గణనల్లో లోపాలు ఏర్పడతాయి.

**ప్రధాన సవాళ్లు:**

క్యూబిట్‌ల స్థిరత్వం
గణనలో లోపాల నియంత్రణ
భారీ సంఖ్యలో నమ్మకమైన క్యూబిట్‌ల నిర్మాణం
క్లిష్టమైన నియంత్రణ వ్యవస్థలు
క్వాంటం లోప సవరణ సాంకేతికత

ఈ సమస్యలను అధిగమించడానికి ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు కొనసాగిస్తున్నారు. క్వాంటం రంగం ఇంకా ప్రారంభ దశలోనే ఉందని ఎన్ఐఎస్‌టీ కూడా పేర్కొంటోంది.

**సాధారణ కంప్యూటర్లకు ప్రత్యామ్నాయం కాదు!**

క్వాంటం కంప్యూటర్ వచ్చిందంటే ప్రతి వ్యక్తి ఇంట్లోని ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్ స్థానంలో క్వాంటం కంప్యూటర్ వస్తుందని భావించడం సరైంది కాదు. సాధారణ కంప్యూటర్లు రోజువారీ పనులకు అత్యంత ఉపయోగకరంగానే కొనసాగుతాయి. క్వాంటం కంప్యూటర్లు మాత్రం ప్రత్యేకంగా అత్యంత క్లిష్టమైన శాస్త్రీయ, గణిత, అనుకరణ సమస్యలను పరిష్కరించడానికి ఉపయోగపడే అవకాశం ఉంది. భవిష్యత్తులో సాధారణ కంప్యూటర్లు, క్వాంటం కంప్యూటర్లు కలిసి పనిచేసే సంకర కంప్యూటింగ్ వ్యవస్థలు మరింత ప్రాధాన్యం పొందవచ్చు.

**ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారుతున్న రంగం**

క్వాంటం సాంకేతిక రంగంలో పరిశోధనలు, పెట్టుబడులు, వాణిజ్య ప్రయత్నాలు వేగంగా పెరుగుతున్నాయి. 2026లో ఫ్రాన్స్‌కు చెందిన క్వాంటం సంస్థ పాస్క్వల్ నాస్‌డాక్‌లో ప్రవేశించడం కూడా ఈ రంగంపై పెరుగుతున్న పెట్టుబడిదారుల ఆసక్తికి ఉదాహరణగా నిలిచింది. అయితే క్వాంటం కంప్యూటర్లలో గణన లోపాలు, స్థిరత్వం వంటి సమస్యలు ఇంకా పరిశ్రమ ముందున్న ప్రధాన సవాళ్లుగానే ఉన్నాయి.

**భవిష్యత్తు ఏ దిశగా?**

క్వాంటం కంప్యూటింగ్ ఇప్పటికీ పూర్తి స్థాయిలో పరిపక్వం చెందలేదు. అయినప్పటికీ, భవిష్యత్ సాంకేతిక ప్రపంచాన్ని ప్రభావితం చేసే అత్యంత ముఖ్యమైన రంగాల్లో ఇది ఒకటిగా మారుతోంది. ఔషధ పరిశోధనలో కొత్త ఆవిష్కరణలు, శాస్త్రీయ అనుకరణలు, క్లిష్ట సమస్యల పరిష్కారం ఒకవైపు ఉంటే, సైబర్ భద్రతకు కొత్త సవాళ్లు మరోవైపు ఉన్నాయి. అందువల్ల క్వాంటం కంప్యూటింగ్ కేవలం ఒక కొత్త కంప్యూటర్ సాంకేతికత మాత్రమే కాదు. ఇది వైద్యం నుంచి విజ్ఞానం వరకు.. ఆర్థిక వ్యవస్థ నుంచి జాతీయ భద్రత వరకు.. భవిష్యత్తు ప్రపంచాన్ని ప్రభావితం చేసే సాంకేతిక విప్లవంగా మారే అవకాశం ఉంది.

**డా. రాహుల్ కుమార్**
**(ఎడిటర్ ఇన్ చీఫ్),**
**హైదరాబాద్ పల్స్ న్యూస్.**



# ఎంఐఎం నుంచి బహిష్కరణ..
# అవి డీప్‌ఫేక్ వీడియోలన్న ఎమ్మెల్సీ

తెలంగాణ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను ఎంఐఎం పార్టీ నుంచి బహిష్కరించడం తెలిసిందే. సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించిన కొన్ని అభ్యంతరకర వీడియోలు వైరల్ కావడంతో పార్టీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. అయితే, ఆ వీడియోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలని, తనను అప్రతిష్ఠపాలు చేసేందుకే ఈ కుట్రకు పాల్పడ్డారని రహ్మత్ బేగ్ ఆరోపించారు. పార్టీ బహిష్కరణకు ముందే తన కుటుంబంతో కలిసి మక్కా వెళ్లిన రహ్మత్ బేగ్, అక్కడి నుంచే ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. హైదరాబాద్‌లోని తన స్నేహితులు ఫోన్ చేసి సోషల్ మీడియాలో కొన్ని అశ్లీల వీడియోలు వైరల్ అవుతున్నట్లు సమాచారం అందించారని ఆయన పేర్కొన్నారు. ఆ వీడియోలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కొందరు ఉద్దేశపూర్వకంగానే తనపై కుట్ర పన్నారని ఆయన స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీని, పార్టీ అధినేతలు అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీల ప్రతిష్ఠను దిగజార్చేందుకే ఈ డీప్ ఫేక్ వీడియోలను సృష్టించారని ఆయన వివరించారు. ఈ అంశంపై తాను ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగంతో పాటు గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశానని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని రహ్మత్ బేగ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఆగస్టు 28వ తేదీ రాత్రి ఎంఐఎం అధిష్ఠానం ఆయనను తక్షణమే పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. శాసనమండలి సభ్యత్వానికి కూడా వెంటనే రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే, బహిష్కరణకు గల నిర్దిష్ట కారణాలను పార్టీ అధికారికంగా ప్రకటించలేదు. తాజా పరిణామాలపై స్పష్టత ఇవ్వాలని ఇతర రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు.



# ఫోర్బ్స్ కవర్‌పై అల్లు అర్జున్..బీటీఎస్ వీడియో పంచుకున్న ఐకాన్ స్టార్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరోసారి సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఆయనకు సంబంధించిన ఒక స్టైలిష్ వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. సరికొత్త లుక్‌లో అల్లు అర్జున్ కనిపించిన ఈ వీడియోను చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. ఇంతకీ ఈ వీడియో ప్రత్యేకత ఏంటంటే.. ప్రతిష్టాత్మక ఫోర్బ్స్ ఇండియా మ్యాగజైన్ కోసం చేసిన ప్రత్యేక ఫోటోషూట్‌కు సంబంధించినదే ఈ వీడియో. అల్లు అర్జున్ స్వయంగా తన సోషల్ మీడియా ఖాతాలో ఈ బిహైండ్ ది సీన్స్ (బీటీఎస్) వీడియోను పంచుకోవడంతో ఇది క్షణాల్లో వైరల్‌గా మారింది.ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా, తాజాగా 'షో స్టాపర్స్ - 2026' పేరుతో ఒక ప్రత్యేక సంచికను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో తమదైన ముద్ర వేస్తూ, అత్యంత ప్రభావం చూపుతున్న 100 మంది ప్రముఖులతో ఈ జాబితాను రూపొందించింది. ఈ ప్రత్యేక సంచికకు కవర్ స్టార్‌గా అల్లు అర్జున్‌ను ఎంపిక చేసి ఆయనకు అరుదైన గౌరవాన్ని అందించింది. ఈ సందర్భంగా జరిపిన ఫోటోషూట్‌లోని ఆసక్తికర క్షణాలనే ఆయన వీడియో రూపంలో అభిమానులతో పంచుకున్నారు.'పుష్ప: ది రైజ్' చిత్రంతో జాతీయ స్థాయిలో సంచలనం రేకెత్తించి పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన అల్లు అర్జున్.. ఆ తర్వాత 'పుష్ప 2: ది రూల్' సినిమాతో ప్రభంజనం సృష్టించారు. ఈ చిత్రాలతో ఆయనకు లభించిన అసాధారణమైన క్రేజ్, బ్రాండ్ వ్యాల్యూ, సోషల్ మీడియాలో ఆయనకున్న ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఫోర్బ్స్ ఇండియా ఈ గుర్తింపును ఇచ్చింది. ఈ ఫోటోషూట్‌లో క్లాసీ సూట్‌లో, సరికొత్త హెయిర్‌స్టైల్‌తో ఆయన కనిపించిన తీరు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు గెలుచుకున్న తొలి తెలుగు హీరోగా చరిత్ర సృష్టించిన అల్లు అర్జున్, ఇప్పుడు ఫోర్బ్స్ ఇండియా కవర్‌పై చోటు దక్కించుకోవడం ఆయన కెరీర్‌లో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఇది ఆయన పాన్ ఇండియా స్టార్‌డమ్‌ను మరింత బలోపేతం చేస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 51 ఏళ్ల వయసులో 'ఫైఫర్'.. 94 ఏళ్ల రికార్డు బద్దలు కొట్టిన మహిళా క్రికెటర్!

ఇంటర్నెట్ డెస్క్: వయసు అనేది కేవలం ఓ సంఖ్య మాత్రమేనని మరోసారి నిరూపించింది 'ఐస్లే ఆఫ్ మ్యాన్' జట్టుకు చెందిన మహిళా క్రికెటర్ జోన్ హిక్స్. 51 ఏళ్ల వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లో ఐదు వికెట్ల ఘనత సాధించి చరిత్ర సృష్టించింది. గ్రీక్‌తో జరిగిన మహిళల టీ20 మ్యాచ్‌లో కేవలం 10 పరుగులకే 5 వికెట్లు పడగొట్టి.. ఏకంగా 94 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టింది. అంతర్జాతీయ క్రికెట్‌లో 50 ఏళ్లు దాటిన తర్వాత ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన తొలి బౌలర్‌గా ఆమె రికార్డు నెలకొల్పింది.

15 ఓవర్లలోనే గ్రీక్ ఆలౌట్

టాస్ గెలిచిన ఐస్లే ఆఫ్ మ్యాన్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. బరిలోకి దిగిన హిక్స్.. గ్రీక్ బ్యాటింగ్ లైనప్‌ను చీల్చిచెండాడింది. లిడియా కట్సిమారి, సోఫియా-నెఫెలి జార్జోటా, అగెలికి-ఐయోన్నా అర్గిరోపౌలూ, థియోడోరా పారిసి-మెసిమెరి, అలెక్జాండ్రా కౌర్కౌలూను పెవిలియన్‌కు పంపింది. ఆమె తీసిన ఐదు వికెట్లలో నాలుగు బౌల్డ్ లేదా ఎల్బీడబ్ల్యూ కావడం విశేషం. హిక్స్ దెబ్బకు గ్రీక్ జట్టు 15 ఓవర్లలో కేవలం 52 పరుగులకే కుప్పకూలింది. అర్గిరోపౌలూ 17 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. మరో బౌలర్ జార్జినా ఫోర్డ్ 2/9తో రాణించింది. స్వల్ప లక్ష్యాన్ని ఐస్లే ఆఫ్ మ్యాన్ జట్టు ఏమాత్రం ఇబ్బంది లేకుండా ఛేదించింది. కేవలం 6 ఓవర్లలో 56/1తో విజయాన్ని అందుకుంది.



94 ఏళ్ల నాటి రికార్డు బద్దలు

హిక్స్ సాధించిన ఈ ఘనతతో 1932 నుంచి కొనసాగుతున్న అరుదైన అంతర్జాతీయ రికార్డు బద్దలైంది. ఇప్పటివరకు ఈ రికార్డు ఆస్ట్రేలియా బౌలర్ బెర్ట్ ఐరన్‌మోంగర్ పేరిట ఉంది. 49 ఏళ్ల వయసులో దక్షిణాఫ్రికాపై మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో అతడు ఐదు వికెట్లు పడగొట్టాడు. ఆ టెస్టులో ఐరన్‌మోంగర్ 5/6, 6/18తో సత్తా చాటాడు. దక్షిణాఫ్రికా 36, 45 పరుగులకే ఆలౌట్ కాగా.. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 72 పరుగుల తేడాతో గెలిచింది. అప్పటి నుంచి 94 ఏళ్లుగా ఆ రికార్డు చెక్కు చెదరలేదు. తాజాగా హిక్స్ దానిని అధిగమించింది. అయితే హిక్స్ తన 40వ ఏట మహిళా క్రికెట్‌లోకి అడుగు పెట్టడం విశేషం. ఇప్పటి వరకు 22 అంతర్జాతీయ టీ20ల్లో 33 వికెట్లు పడగొట్టింది. అందులో మూడు ఐదు వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి.

# టీమిండియా మ్యాచ్‌లకు టైటిల్ స్పాన్సర్ కరవు.. కారణం ఇదేనా!

ఇంటర్నెట్ డెస్క్: టీమిండియా స్వదేశీ మ్యాచ్‌లకు కొత్త టైటిల్ స్పాన్సర్ కోసం బీసీసీఐ చేస్తున్న ప్రయత్నాలు ఇంకా కొలిక్కి రాలేదు. బిడ్ల దాఖలుకు గడువు ఆగస్టు 13తో ముగిసినా.. ఇప్పటివరకు బోర్డు కొత్త స్పాన్సర్‌ను ఖరారు చేయలేదు. ప్రస్తుతం పలువురు సంస్థలతో బీసీసీఐ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. గూగుల్ జెమినీ, స్విన్నీ, ఎస్‌బీఐ లైఫ్ వంటి సంస్థల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.జులై 20న బీసీసీఐ టైటిల్ స్పాన్సర్ కోసం టెండర్ ఆహ్వానాన్ని జారీ చేసింది. ఆగస్టు 4 వరకు ఐటీసీ పత్రాలను కొనుగోలు చేసేందుకు అవకాశం ఇచ్చింది. ఆగస్టు 5న సందేహాల నివృత్తికి చివరి తేదీగా నిర్ణయించింది. ఆగస్టు 13న బిడ్ల దాఖలు గడువు ముగిసింది. అయితే రెండు వారాలు గడిచినా కొత్త స్పాన్సర్‌పై స్పష్టత రాకపోవడం గమనార్హం.

రూ.4.75 కోట్ల బేస్ ప్రైస్.. ఇదే సమస్య?

ప్రస్తుతం టీమిండియా స్వదేశీ మ్యాచ్‌ల టైటిల్ హక్కులు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ వద్ద ఉన్నాయి. ఒక్కో మ్యాచ్‌కు ఆ సంస్థ బీసీసీఐకి రూ.4.2 కోట్లు చెల్లిస్తోంది. అయితే కొత్త బిడ్డింగ్‌లో బీసీసీఐ కనీస ధరను రూ.4.75 కోట్లుగా నిర్ణయించింది. ఈ పెరిగిన బేస్ ప్రైస్ కారణంగానే సంస్థలు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త ఒప్పందం రెండేళ్ల పాటు.. అంటే 2028 మార్చి 31 వరకు కొనసాగనుంది. గతంలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మూడేళ్ల ఒప్పందాన్ని దక్కించుకుంది. తాజా ఒప్పందం ప్రకారం సుమారు 35 మ్యాచ్‌లకు టైటిల్ స్పాన్సర్ హక్కులు లభిస్తాయి. ఇందులో 10 టెస్టులు, 12 వన్డేలు, 13 టీ20లు ఉన్నాయి.


బిడ్డర్లకు ఆర్థిక అర్హతలు తప్పనిసరి




టైటిల్ స్పాన్సర్ కోసం బీసీసీఐ కఠినమైన ఆర్థిక అర్హతలను కూడా విధించింది. బిడ్డర్‌కు గత మూడు ఆడిట్ చేసిన ఆర్థిక సంవత్సరాల్లో సగటు టర్నోవర్ కనీసం రూ.100 కోట్లు ఉండాలి. లేదా అదే కాలానికి సగటు నికర విలువ కనీసం రూ.100 కోట్లు ఉండాలని బీసీసీఐ నిబంధనల్లో పేర్కొంది. ఈ నిబంధనలు, పెరిగిన బేస్ ప్రైస్ కారణంగా బీసీసీఐకి కొత్త టైటిల్ స్పాన్సర్‌ను ఖరారు చేయడం ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. మరి టీమిండియా స్వదేశీ మ్యాచ్‌లకు కొత్త స్పాన్సర్‌గా ఎవరు వస్తారో చూడాలి.

## SPORTS

# ధోని, కోహ్లి ఇచ్చిన సలహాలు పని చేశాయి పంజాబ్ ప్లేయర్ యశ్ ఠాకూర్



ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్‌లో అవకాశాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో టీమిండియా స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, ఎంఎస్ ధోని ఇచ్చిన విలువైన సలహాలు పని చేశాయని భారత పేసర్ యశ్ ఠాకూర్ గుర్తు చేసుకున్నాడు. కష్టకాలంలో వారిద్దరి మాటలు తనకు ఎంతో ఉపయోగపడ్డాయని చెప్పాడు. 27 ఏళ్ల యశ్ ఠాకూర్ ఐపీఎల్‌లో ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ జట్టులో కొనసాగుతున్నాడు. 2023, 2024 సీజన్లలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరపున 19 మ్యాచ్‌లు ఆడి 24 వికెట్లు పడగొట్టాడు. అయితే పంజాబ్ కింగ్స్‌కు వచ్చిన తర్వాత ఆడే అవకాశాలు తగ్గిపోయాయి. అర్షదీప్ సింగ్, మార్కో యాన్సెన్, జేవియర్ బార్ట్‌లెట్ వంటి సీనియర్ పేసర్ల కారణంగా ఇప్పటివరకు కేవలం మూడు మ్యాచ్‌ల్లోనే బరిలోకి దిగాడు. ఈ క్రమంలో ఐపీఎల్‌లో ఎక్కువ సమయం బెంచ్‌పైనే ఉండాల్సి రావడంతో తీవ్ర నిరాశకు గురైన అతడికి.. విరాట్, ధోని ఇచ్చిన సలహాలు ఎంతో ధైర్యాన్నిచ్చాయని తెలిపాడు.'నాకు అవకాశాలు రావడం లేదు.. చాలా నిరాశగా ఉందని కోహ్లితో చెప్పాను. భవిష్యత్ గురించి ఎక్కువగా ఆలోచించవద్దని ఆయన సూచించాడు. ఇప్పటివరకు వచ్చిన అవకాశాలకు కృతజ్ఞతగా ఉండటం కూడా అంతే ముఖ్యమని చెప్పాడు. రోజురోజుకూ నా సన్నద్ధతను మెరుగుపరుచుకోవాలని సూచించాడు. ఎప్పుడైనా ఆడే అవకాశం వచ్చినప్పుడు.. 'నేను సిద్ధంగా లేను' అనే భావన ఉండకూడదని చెప్పాడు. దీంతో నా ప్రిపరేషన్‌పై మరింత దృష్టి పెట్టడం ప్రారంభించాను' అని యశ్ ఠాకూర్ వెల్లడించాడు.

ధోనీ మాటలతో ఒత్తిడి దూరం

'భారీ సంఖ్యలో ప్రేక్షకుల ముందు ఎప్పుడూ ఆడలేదు. అందుకే చాలా నెర్వస్‌గా, ఒత్తిడిగా అనిపిస్తోందని ధోనికి చెప్పాను. భవిష్యత్‌లోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురవుతాయని ఆయన చెప్పారు. ఐపీఎల్‌లో అయినా.. భారత్ తరపున ఆడుతున్నా ఇదే ఫీలింగ్ రావచ్చన్నారు. అందుకే ఎక్కువగా ఆలోచించకుండా.. జరుగుతున్న విషయాలను సహజంగా స్వీకరించాలని, కొంత సమయం తీసుకుని ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఆ పద్ధతి ఇప్పటికీ నాకు ఎంతో ఉపయోగపడుతోంది. ఎప్పుడైనా ఒత్తిడిగా అనిపిస్తే.. ముందుగా నన్ను నేను సెటిల్ చేసుకునేందుకు కొంత సమయం తీసుకుంటాను' అని యశ్ వెల్లడించాడు.ఇదిలా ఉంటే, యశ్ ఠాకూర్‌కు ఇటీవలే భారత జట్టులో చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో టీమిండియా తరఫున అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు భారత్ తరఫున రెండు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి నాలుగు వికెట్లు పడగొట్టాడు.